ఉష్ణోగ్రత (అంచనా)

29-4-2025	గరిష్ఠం	కనిష్ఠం
గుంటూరు	40	25
తెనాలి	38	26
నరసరావుపేట	40	25
బాపట్ల	36	27
రెంటచింతల	41	26



మహాత్మా గాంధీ బ్లాక్‌ను ప్రారంభిస్తున్న సీఎం చంద్రబాబు

- యువత చేతిలో.. దేశ భవిష్యత్తు!
- సంస్థలను స్థాపించేలా ఎదగండి
- 2న ప్రధాని చేతుల మీదుగా రాజధాని పనుల ప్రారంభం
- అప్పటి నుంచి అమరావతి అన్‌స్టాపబుల్
- విట్ వర్సిటీలో 'వీ లాంచ్ ప్యాడ్ 2025 – స్టార్టప్ ఎక్స్‌పో'లో సీఎం
- క్యాంపస్‌లో పలు భవనాల ప్రారంభం

క్వాంటం వ్యాలీగా.. అమరావతి

గుంటూరు,తుళ్లూరు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ఏపీని ఇన్నోవేషన్ వ్యాలీగా తీర్చిదిద్దుతున్నామని, సిలికాన్ వ్యాలీకి దీటుగా అమరావతిలో క్వాంటమ్ వ్యాలీని రూపొందిస్తామని సీఎం చంద్రబాబు అన్నారు. రాజధానిలోని విట్ అమరావతిలో సోమవారం నిర్వహించిన 'వీ లాంచ్ ప్యాడ్ 2025- స్టార్టప్ ఎక్స్‌పో'లో ఆయన పాల్గొన్నారు. క్యాంపస్‌లో నూతనంగా నిర్మించిన మహాత్మాగాంధీ బ్లాక్, వీవీ గిరి బ్లాక్, ఆచార్య ఎన్‌జీ రంగా, దుర్గాబాయి దేశ్ ముఖ్ బ్లాక్‌లను విట్ అధినేత విశ్వ నాథన్, మంత్రి దుర్గేష్‌తో కలిసి ముఖ్యమంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన స్టార్టప్ ఎక్స్‌పోను ప్రారంభించి ఎక్స్‌పో పాల్గొన్న విద్యార్థులతో సీఎం ఇంటరాక్ట్ అయ్యారు. దేశ భవిష్యత్తు యువత చేతి లోనే ఉందని, యువత రం ఎంటర్‌ప్రెన్యూర్లుగా ఎదగాలని, అప్పుడే 2047నాటికి భారత దేశం ప్రపంచంలో నెంబర్ వన్ అవుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. ఎక్స్‌పోలో ప్రదర్శించిన ఆవిష్కరణల వివరాలను అడిగి తెలుసు కున్నారు. అనంతరం సభలో విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. మే 2వ తేదీన ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా రాజధాని పనుల పునఃప్రారంభం కాబోతున్నాయని చెప్పారు.

విట్ అధినేత విశ్వనాథన్ సాధారణమైన వ్యక్తిగా తన జీవితం ప్రారంభించి అసాధారణమైన వ్యక్తిగా ఎదిగిన తీరు అభినందనీయమని ముఖ్యమంత్రి అన్నారు. 20 ఏళ్ల రాజకీయ జీవితంలో ఆయన అన్నాదురై, కరుణానిధి, ఎంజీఆర్, జయలలితతో పనిచేశారని గుర్తుచేశారు. విశ్వనాథన్ 2014లో ఎన్నికల ఫలితాలు రాకముందే తనను కలిసి, గెలిచిన వెంటనే అమరావతిలో విట్ ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలని కోరారన్నారు. ఆయన ఆరోజున 200 ఎకరాలు అడిగితే, 100 ఎకరాలే ఇచ్చామని, మిగిలిన భూమి కూడా ఇచ్చే బాధ్యత తమ దేనని, అయితే ప్రస్తుతం ఉన్న 17వేల మంది విద్యార్థుల సంఖ్య వచ్చే ఏడేళ్లలో 50వేలకు పెరగాలని ఆయన షరతు విధించారు. విట్ అమరావతిలో 95 శాతం ప్లేస్‌మెంట్స్ జరుగు తుండటం అభినందనీయమని, ప్రపంచంలోని టాప్ 100 యూనివర్సిటీలో విట్ ఉండటం మనకు గర్వకారణమని, అయితే విట్ విద్యా సంస్థల్లో మనఅమరావతి విట్ నెంబర్‌వన్‌గా ఉండాలని కోరుకుంటున్నానని ముఖ్యమంత్రి చెప్పారు.

కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి, పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫి మంత్రి కందుల దుర్గేష్, జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మీ, తాడికొండఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్, తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సింహా, జిల్లా ఎస్పీ సతీష్ కుమార్, విట్ యూనివర్సిటీ ఫౌండర్, చాన్సలర్ డా.జీ విశ్వనాథన్, టీఐఈ గ్లోబల్ చైర్మన్ మురళి బుక్కపట్నం, ఐబీఎల్ గ్లోబల్ సీఈఓ ఎడియటా వోల్సిక్, టాటా కన్సల్టెన్సీ సర్వీస్ హెడ్ చల్లా నాగ్, విట్ వైస్ ప్రెసిడెంట్ శంకర్ విశ్వనాథన్, అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ కాదంబరీ ఎస్ విశ్వనాథన్, వైస్ చాన్సలర్ డా. ఎస్‌వీ కోటా రెడ్డి, జిల్లా అధికారులు, విట్ యూనివర్సిటీ ఆధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అమరావతికి తిరుగులేదు

సీఎం చంద్రబాబు

ప్రధాని మోదీ చేతుల మీదుగా రాజధాని పనులు మే 2న పునఃప్రారంభమ వుతాయని, తాను అందరిలా మాటలు చెప్పనని, ప్రజలకు మంచి చేసి చూపిస్తానని చెప్పారు. తనపై నమ్మకం పెట్టుకుని 29 వేల మంది రైతులు, 34 వేల ఎకరాల భూమి రాజధానికి ఇచ్చారని, అభివృద్ధిలో భాగస్వామ్యం అవుతామని రైతులు ముందుకురావడం అభినందనీయమని అన్నారు. ఆ 29 గ్రామాల బిడ్డలకు అమరావతిలో అత్యుత్తమ విద్య పొందే అవకాశం కల్పించాలని, వారిలోంచి ఎంటర్‌ప్రెన్యూర్లను వెలికి తీయాలని భావిస్తున్నట్లు సీఎం చెప్పారు. 1991లో ఆర్థిక సంస్కరణలకు మన తెలుగు బిడ్డ పీవీ నరసింహారావు శ్రీకారం చుట్టారు. వాటిని తాను అందిపుచ్చుకున్నానని, భవిష్యత్ ఐటీదేనని గ్రహించి దానికి అధిక ప్రాధాన్యత ఇచ్చానని, 14 నెలల్లో హైటెక్ సిటీ నిర్మించామన్నారు. ఇప్పుడు రాజధాని అమరావతిపై దృష్టి కేంద్రీకరించామని, త్వరలో అమరావతిలో రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ఏర్పాటు చేయబోతున్నామని తెలిపారు.. సిలికాన్ వ్యాలీ తరహాలో అమరావతిలో క్వాంటమ్ వ్యాలీకి ఫౌండేషన్ వేస్తున్నామన్నారు. ఆ అవకాశాన్ని అందిపుచ్చుకుని ప్రతి ఇంట్లో ఎంట్రప్రెన్యూర్ తయారుకావాలన్నారు.. అ మరావతిలో విట్, ఎస్ఆర్ఎం వంటి విద్యా సంస్థలు ఇప్పటికే పనిచేస్తున్నాయి. భవిష్యత్‌లో ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన యూనివర్సిటీలు అమరావతికి రాబోతున్నాయన్నారు. 29 వేల మంది రైతులు, రైతు కూలీలు అమరావతికి సహకరించారని, వారందరినీ ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత తనపై ఉందని సీఎం వివరించారు. వారిలో కొందరిని దత్తత తీసుకోవాలని విట్ చాన్సలర్ విశ్వనాథన్‌ను కోరినట్లు చెప్పారు. రాష్ట్రంలో కొత్త విద్యాసంస్థల ఏర్పాటు, ఐటీ, ఏఐ వినియోగంపై విట్ విద్యార్థులు పలు ప్రశ్నలు అడగ్గా ముఖ్యమంత్రి వాటికి సమాధానం చెప్పారు.



వీఐటీలో విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు నాయుడు

విధేయతకే పట్టం

- గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ మేయర్‌గా కోవెలమూడి ఎన్నిక
- 7 ఓట్ల మెజార్టీతో గెలుపొందిన టీడీపీ అభ్యర్థి
- ప్రమాణ స్వీకారం.. వెనువెంటనే బాధ్యతల స్వీకరణ
- గంటలోనే ముగిసిన మేయర్ ఎన్నిక ప్రక్రియ
- అన్నీ తానై నడిపించిన కేంద్ర మంత్రి పెమ్మసాని
- వెల్లువెత్తిన అభినందనలు.. ఆనందోత్సాహాలు.
- నగరంలో భారీ ర్యాలీ.. ఊరేగింపు



మేయర్‌గా ఎన్నికైన రవీంద్రకు మేయర్ టోపీ పెడుతున్న కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్.

గుంటూరు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): గుంటూరు నగర మున్సిపల్ కార్పొరేషన్ మేయర్‌గా కోవెలమూడి రవీంద్ర(నాని) ఎన్నికయ్యారు. నగరపాలక సంస్థలోని కౌన్సిల్ హాల్ లో నిర్వహించిన ఎన్నిక ప్రక్రియలో గుంటూరు నగరపాలక సంస్థ 7వ మేయర్‌గా గెలుపొంది, పదవీ బాధ్యతలు చేపట్టారు. సోమవారం గుంటూరు నగర మేయర్ పదవికి జరిగిన ఎన్నికలో కూటమి ప్రభుత్వం తరపున టీడీపీ అభ్యర్థిగా కోవెలమూడి రవీంద్ర, వైసీపీ అభ్యర్థిగా అచ్చాల వెంకటరెడ్డి బరిలో నిలిచారు. అచ్చాల వెంకటరెడ్డిపై కోవెలమూడి రవీంద్ర 7 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. గుంటూరు నగర మేయర్‌గా కోవెల మూడి రవీంద్ర గెలుపొందినట్లుగా ఎన్నికల ప్రిసైడింగ్ అధికారి, జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవతేజ ప్రకటించారు. ఈ మేరకు డిక్లరేషన్ ఫామ్‌ను అందజేశారు. నగరపాలక సంస్థలో 57 మంది కార్పొరేటర్లు, ఒక ఎంపీ, ముగ్గురు ఎమ్మెల్యేలు, ముగ్గురు ఎమ్మెల్సీలు ఉన్నారు. వారిలో 48వ డివిజన్ కార్పొరేటర్ తను బుద్ధి కృష్ణారెడ్డి మరణించారు. దీంతో కార్పొరేటర్ల సంఖ్య 56 కాగా, మొత్తం 63 మందికి కాను 61 మంది మాత్రమే మేయర్ ఎన్నికల్లో పాల్గొన్నారు. వైసీపీకి చెందిన కార్పొరేటర్లు మర్రి అంజలి, యాట్ల రవికుమార్ ఎన్నికల్లో పాల్గొనలేదు.



మేయర్‌గా నానిచే ప్రమాణం చేయిస్తున్న జేసీ భార్గవ తేజ, ప్రక్కన కేంద్ర మంత్రి పెమ్మసాని, ఎమ్మెల్యేలు రామాంజనేయులు, మాధవి, నసీర్, ఎమ్మెల్సీ ఆలపాటి రాజా, సజీలా

7 ఓట్ల మెజార్టీతో విజయం..

నగరపాలక సంస్థ మేయర్ అభ్యర్థిగా కోవెలమూడి రవీంద్రను ప్రత్తిపాడు ఎమ్మెల్యే బి.రామాంజనేయులు ప్రతిపాదించారు, జనసేనకు చెందిన కార్పొరేటర్ సంకురి శ్రీనివాసరావు బలపరిచారు. వైసీపీ అభ్యర్థి అచ్చాల వెంకటరెడ్డిని మేయర్ అభ్యర్థిగా ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం ప్రతిపాదించారు. 45 డివిజన్ కార్పొరేటర్ ఎక్కలూరి మారుతీరాణి బలపరిచారు. మొత్తం 61 మంది ఓటింగ్‌లో పాల్గొనగా టీడీపీ అభ్యర్థి నానికి 34 ఓట్లు వచ్చాయి. వైసీపీ అభ్యర్థి వెంకట్‌రెడ్డికి 27 ఓట్లు వచ్చాయి. దీంతో మెజార్టీ సభ్యులు చేతులెత్తి నానిని ఎన్నుకున్నారు. వైకాపా సభ్యులు ఇద్దరూ హాజరైనప్పటికీ మేయర్‌గా నాని గెలుపు ఆగేది కాదు. నాని గెలుపొందడంతో వైసీపీ ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, చంద్రగిరి ఏసురత్నం, ఆ పార్టీకి చెందిన మిగతా 25 మంది కార్పొరేటర్లు సమావేశం నుంచి వెళ్లిపోయారు.





కార్పొరేషన్‌కు వస్తున్న కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని, ఎమ్మెల్యేలు మాధవి, నసీర్ అహ్మద్, రామాంజనేయులు ఎమ్మెల్సీ ఆలపాటి. టీడీపీ కార్పొరేటర్లు

ప్రమాణ స్వీకారం, బాధ్యతల స్వీకరణ

గుంటూరు నగర మేయర్‌గా గెలుపొందిన నాని కౌన్సిల్ హాల్‌లోనే మేయర్ పీఠాన్ని అధిష్ఠించారు. కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యేలు మాధవి, నసీర్ అహ్మద్, రామాంజనేయులు తదితరుల సమక్షంలో ఆయన ప్రమాణ స్వీకారం చేశారు. ఎన్నికల అధికారి భార్గవ్‌తేజ నానితో మేయర్‌గా ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం కొద్దిసేపటికి మేయర్ చాంబర్‌లోకి వచ్చి గుంటూరు మేయర్‌గా బాధ్యతలు చేపట్టారు. హిందూ, క్రైస్తవ , ముస్లిం మత పెద్దల ఆశీర్వచనాలు పొందారు. ఉదయం 11 గంటలకు కౌన్సిల్ హాల్‌లో సమావేశం నిర్వహించి, మేయర్ (మిగతా 8వ పేజీలో)

నగరంలో.. లోఓల్టేజ్

- లోడ్‌కు అనుగుణంగా ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటులో విఫలం
- అదనపు లోడ్‌కు కేసులతో సరి
- ఫ్యూజ్ ఆఫ్ కాల్‌కు స్పందన లేకపోవడంపై విమర్శలు

గుంటూరు, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): నగరంలో విద్యుత్ లోఓల్టేజ్ సమస్య నానాటికి పెరుగుతోంది. గతంతో పోల్చితే ప్రస్తుతం అక్కడా ఇక్కడా అనే తేడా లేకుండా అనేక ప్రాంతాల్లో ఈ సమస్య ఉత్పన్నమవుతోందని వినియోగదారుల నుంచి ఫిర్యాదులు అందుతున్నాయి. ఇటీవల గుంటూరు టౌన్-1 ఆపరేషన్ డివిజన్ పరిధిలోని సీజీఆర్ఎఫ్ (కన్స్యూమర్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ ఫోరం) చైర్మన్ విక్టర్ ఇమ్మానుయేల్ నేతృత్వంలో జరిగిన అదాలత్‌లో వినియోగదారుల నుంచి లో ఓల్టేజ్ సమస్యలు వెల్లువెత్తాయి. గతంలో కంటే తాజాగా గృహాల్లో ఎలక్ట్రానిక్ గృహోపకరణాల వినియోగం రెట్టింపయ్యింది. వాషింగ్ మిషన్‌లు, గీజర్‌లు, ఎయిర్ కండీషన్‌ల వినియోగం పెద్ద ఎత్తున జరుగుతోంది.

గతంలో నగరంలో ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లు (డీటీఆర్)కు మించి అదనపు లోడ్ పడడంతో ఈ సమస్య ఉత్పన్నమవుతోంది. పాత గుంటూరు, నల్లచెరువు, ఏటుకూరు రోడ్డు, శ్రీనివాసరావుపేట, ఏటి అగ్రహారం, సంపత్ నగర్, అమరావతి రోడ్డులోని పలు ప్రాంతాలు, ఇన్నర్ రింగ్ రోడ్డు ప్రాంతాల్లో కూడా లో ఓల్టేజ్ సమస్య నెలకొంటున్నట్లు వినియోగదారుల నుంచి ఫిర్యాదులు వినిపిస్తున్నాయి. గతంలో వినియోగానికి అనుగుణంగా నగరంలో 63 కేవీ, 100 కేవీ, 160 కేవీ, 250 కేవీ, 315 కేవీ, 500 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశారు. ఆయా ప్రాంతాల్లో లోడ్‌కు అనుగుణంగా డీటీఆర్‌ల సామర్థ్యాన్ని పెంచుకోవాల్సిన అవసరం ఉంది. డీటీఆర్‌లు ఏర్పాటు చేయడంలో విద్యుత్‌శాఖ యంత్రాంగం విఫలమవుతుందన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

ఫ్యూజ్ ఆఫ్ కాల్‌కు స్పందించడం లేదు

నగరంలోని విద్యుత్ సెక్షన్ కార్యాలయాల్లో ఫ్యూజ్ ఆఫ్ కాల్‌కు సిబ్బంది నుంచి స్పందన కనిపించడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇటీవల జరిగిన సీజీఆర్ఎఫ్ అదాలత్‌లోనూ వినియోగదారులు ఫిర్యాదులు చేశారు.


రేపు పాలీసెట్ ప్రవేశ పరీక్ష

- నగరంలో 11 కేంద్రాలు, 4,030 మంది విద్యార్థులు

గుంటూరు (విద్య) ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): పాలిటెక్నిక్ కళాశాలలో ప్రవేశం కోసం రేపు పాలీసెట్ నిర్వహించనున్నారు. ఇందుకోసం గుంటూరు నగరంలో మొత్తం 11 కేంద్రాలు ఏర్పాటు చేశారు. గుజ్జనగుళ్లలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో రెండు, టీజేపీఎస్ పీజీ కళాశాల, డిగ్రీ కళాశాలలో రెండు, మార్కెట్ సెంటర్‌లోని హిందూ కళాశాల, ఏసీ కళాశాల, బ్రాడీపేట లోని బండ్లమూడి హనుమాయమ్మ జూనియర్, డిగ్రీ కళాశాలలో రెండు కేంద్రాలు ఏర్పాటు చేశారు. అలాగే బ్రాడీపేటలోని శ్రీ మాజేటి గురవయ్య జూనియర్ కళాశాల, పలకలూరులోని విజ్ఞాన్ డిగ్రీ కళాశాల, చంద్రమౌళి నగర్ 3/1 లోని భాష్యం హైస్కూల్ తదితర ప్రాంతాల్లో కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఆయా కేంద్రాల్లో మొత్తం 4,030 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నట్లు నల్లపాడులోని ఎంటీ టీసీ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ శేఖర్ బాబు వెల్లడించారు. విద్యార్థుల హాల్ టికెట్లు ఇప్పటికే పాలీసెట్ వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని వెల్లడించారు.

డీసీసీబీ చైర్మన్‌గా మాజీ ఎమ్మెల్యే మక్కెన

- 'వడ్రాణం'కు డీసీఎంఎస్
- కుర్రా అప్పారావుకు మరో పోస్టు హామీ



మక్కెన మల్లికార్జునరావు
డీసీసీబీ చైర్మన్



వడ్రాణం హరిబాబు
డీసీఎంఎస్ చైర్మన్

నరసరావుపేట, వినుకొండ, గుంటూరు సిటీ, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లాను నామినేటెడ్ పదవు లు వరించాయి. 'ఆంధ్రజ్యోతి' ముందే చెప్పిన ట్లుగా ఆ ఇద్దరు నేతల్లో ఒక్కరికి డీసీసీబీ పదవి దక్కింది. అత్యంత కీలకమైన పదవిగా భావించే జిల్లా సహకార కేంద్ర బ్యాంకు(డీసీసీబీ) చైర్మన్ గా పల్నాడు జిల్లా వినుకొండ మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, జిల్లా మార్కెటింగ్ సొసైటీ(డీసీఎంఎస్) చైర్మన్‌గా పొన్నూరు నియోజకవర్గానికి చెందిన టీడీపీ నాయకుడు వడ్రాణం హరిబాబు నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం సాయంత్రం ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత డీసీసీబీ చైర్మన్ పదవి కోసం పలువురు పోటీపడ్డారు. మక్కెనతో పాటు టీడీపీ ముఖ్య నేత కుర్రా అప్పారావు పేర్లు ప్రముఖంగా వినిపించాయి. కుర్రా అప్పారావుకు ఉమ్మడి జిల్లాలోని పలువురు ఎమ్మెల్యేలు, ఎంపీలు మద్దతు కూడా ప్రకటించారు. అయితే 2024 ఎన్నికల సందర్భంగా మక్కెనకు డీసీసీబీ పదవి ఇస్తానని ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు హామీ ఇచ్చినట్లు సమాచారం. ఆ హామీని నిలబెట్టుకునే నేపథ్యంలో డీసీసీబీకి మక్కెన పేరును ఖరారు చేసినట్లు తెలుస్తోంది. ఎన్నికల్లో అత్యంత కీలకంగా వ్యవహరించిన కుర్రా అప్పారావుకు మరో కీలక పదవి ఇచ్చేందుకు టీడీపీ అధిష్ఠానం హామీ ఇచ్చినట్లు తెలుస్తోంది. త్వరలోనే ముఖ్యమైన పోస్టులకు నియామకాలు జరగనున్నందున కుర్రాకు అవకాశం వస్తుందని చెబుతున్నారు.

పాఠ్యపుస్తకాల పంపిణీకి ముందస్తు ఏర్పాట్లు

- పాఠశాలలు ప్రారంభం కాగానే పంపిణీ
- ఉమ్మడి జిల్లాకు అవసరం 13.24 లక్షలు.. ఇప్పటికే వచ్చినవి 7.50 లక్షలు

గుంటూరు (విద్య) ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): పాఠశాలలో పునప్రారంభం అయ్యే నాటికి విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందించేలా విద్యాశాఖ ప్రణాళిక సిద్ధం చేసింది. ఇందులో భాగంగా గుంటూరులోని పుస్తకాల గోదాము నుంచి ఉమ్మడి జిల్లాలోని స్టాక్ పాయింట్లకు పాఠ్యపుస్తకాలు పంపిణీ ప్రారంభించారు. ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ, జడ్పీ, ఎయిడెడ్, కేజీబీవీ ,మోడల్ స్కూల్స్, రెసిడెన్షియల్ స్కూల్స్, మండల పరిషత్ మున్సిపల్ కార్పొరేషన్ యాజమాన్యాల ఆధ్వర్యంలో దాదాపు 6 వేలకు పైగా పాఠశాలలు ఉన్నాయి .ఆయా పాఠశాలల్లో దాదాపు 6.75 లక్షల మంది విద్యార్థినీ విద్యార్థులు ఒకటి నుంచి 10వ తరగతి వరకు విద్యాభ్యాసం చేస్తున్నారు. ఆయా విద్యార్థులకు తరగతుల వారీగా మారిన సిలబస్ ప్రకారం నూతన పాఠ్యపుస్తకాల పంపిణీకి విద్యాశాఖ ఇప్పటికే ఏర్పాటు చేసింది. జిల్లాకు వచ్చిన పాఠ్యపుస్తకాలను ఎప్పటికప్పుడు ఆర్టీసీ బస్సుల ద్వారా రవాణా చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రభుత్వ పాఠ్యపుస్తకాల కోసం ప్రత్యేకంగా గోదాములు ఏర్పాటు చేశారు. గోరంట్లలో ఒకటి మంగళగిరి రోడ్డులో మరొక గోదాము ఉన్నాయి. ఆయా గోదాములకు వచ్చిన పాఠ్య పుస్తకాలను ఉమ్మడి జిల్లాలోని మండలాల వారీగా పంపించేందుకు డీఈఓ సివి రేణుక ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

ప్రధాని సభకు.. మంత్రులకు బాధ్యతలు
- మంగళగిరి వైపు నుంచి వచ్చే ప్రజల బాధ్యత మంత్రి గొట్టిపాటికి
- రాజధానిలో మనోహర్ రచ్చబండ కార్యక్రమాలు
8

ఆయిల్ చోరీ కేసు..వైసీపీ నేత అరెస్టు

● కోర్టులో హాజరుపరిచిన నెల్లూరు పోలీసులు


నీళ్లవాగులో పడిన ఆయిల్ ట్యాంకర్

పిడుగురాళ్ల, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): పిడుగురాళ్లకు చెందిన వైసీపీ నేత చీదెళ్ల కృష్ణ, రవిపై నెల్లూరు పోలీసులు కేసు నమోదు చేసి సోమవారం కోర్టులో హాజరుపరిచారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సౌత్ ఇండియా కంపెనీ నుండి బెంగళూరులోని సౌభాగ్య ఫుడ్స్‌కు వెళ్లాల్సిన ఆయిల్ ట్యాంకర్‌ను పిడుగురాళ్లకు చెందిన వైసీపీ నేత చీదెళ్ల కృష్ణ, రవి, ట్యాంకర్ డ్రైవర్, మరికొందరితో కలిసి దారి మళ్లించారు. ట్యాంకర్‌లోని ఆయిల్‌ను తోడించేశారు. అనంతరం కట్టుకథ అల్లి నమ్మించేందుకు ఆయిల్ ట్యాంకర్ వాగులో పడిపోయినట్లుగా చిత్రీకరించారు. సౌత్ ఇండియా కంపెనీ యాజమాన్యం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో.. పోలీసుల దర్యాప్తులో భాగంగా లారీ డ్రైవర్‌ను విచారించారు. పిడుగురాళ్లకు చెందిన చీదెళ్ల కృష్ణ, రవితో కలిసి ఆయిల్‌ను చోరీ చేసినట్లు అతను వెల్లడించాడు. కృష్ణ, రవి ఆయిల్‌ను ప్యాకెట్లు, డబ్బాలకు నింపి కొంత కల్తీ కలిపి ఎక్కువ ధరకు విక్రయిస్తున్నట్లు వాంగ్మూలం ఇచ్చాడు. దీంతో ఈ ఘటనకు సంబంధించిన వారందరినీ నెల్లూరు పోలీసులు అరెస్టు చేశారు. నెల్లూరుకు చెందిన మరో నలుగురు ఈ చోరీలో పాల్గొన్నట్లు పోలీసులు గుర్తించారు.

గుజరాత్ టు గుంటూరు

● మార్కెట్‌ను ముంచెత్తుతున్న నిషేధిత పత్తి విత్తనాలు ● ఉమ్మడి జిల్లాలో విచ్చలవిడిగా విక్రయాలు



గుంటూరు సిటీ, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): పర్యావరణానికి తీవ్రంగా హాని కలిగించే బీజీ-3 పత్తి విత్తనాలు ఉమ్మడి గుంటూరు జిల్లాలో హల్ చల్ చేస్తున్నాయి. ఖరీఫ్ సాగు కోసం పత్తి విత్తనాలు కొనుగోలుకు ముందుకు వస్తున్న రైతులకు బీజీ-3ని అంటగడుతున్నారు. గుంటూరుకు కూత వేటు దూరంలోని తాడికొండ, అమరావతి, పల్నాడులో జిల్లాలోని మరికొన్ని మండలాల్లో నేరుగా ఇళ్ల వద్దకు తీసుకువెళ్లి నిషేధిత విత్తనాలు విక్రయిసున్నారు. దిగుబడి పెరగడంతో పాటు,చీడ, పీడలను సమర్థవంతంగా ఎదుర్కొనే సామర్థ్యం ఎక్కువగా ఉండటంతో రైతులు కూడా అత్యంత ప్రమాదకరమైన బీజీ-3 వైపు మొగ్గుచూపుతున్నారు.

బీజీ- 3 చాలా ప్రమాదం

పత్తి దిగుబడి పెంచేందుకు విరివిగా జరిపిన పరిశోధనల ఫలితంగా బీటీ, బీజీ విత్తనాలు మార్కెట్‌లోకి వచ్చాయి. బీటీ సాగుకు ప్రభుత్వ అనుమతి ఉంది. బీటీ విత్తనాలు మార్కెట్ లోకి వచ్చిన తరువాత పత్తి సాగు పూర్తి లాభదాయకం గా మారింది. సుమారు రెండు దశాబ్దాల క్రితం ఆవిష్కృతమైన బీటీ విత్తనాలు ప్రస్తుతం కొన్ని ఒడిదుడుకులు ఎదుర్కొంటున్నాయి. నాలుగు సంవత్సరాలుగా తెగుళ్ల సోకటం వల్ల రైతులు బీటీ ని పెద్దగా విశ్వసించని పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో బీజీ-3పై మక్కువ పెరుగుతున్నట్లు కనిపిస్తున్నది. అయితే పర్యావరణానికి తీవ్రంగా హాని కలిగిస్తున్న బీజీ-3 ని ప్రభుత్వం ఎప్పుడో నిషేధించింది. బీజీ-3 అమ్మకాలు జరిపితే కఠినమైన చర్యలు తీసుకుంటామని వ్యాపారులకు కూడా హెచ్చరికలు జారీ చేశారు. అయినా కొందరు వ్యాపారులు వాటినే విరివిగా అమ్ముతున్నారు. గతంలో అనేక మార్లు పట్టుబడిన వ్యాపారులే ప్రస్తుతం తాడికొండ, అమరావతి మండలాల్లో ఎక్కువగా బీజీ-3 విత్తనాలు విక్రయిస్తున్నారు. పల్నాడు జిల్లాలో కూడా అదే విత్తనాలు ఎక్కువగా అమ్ముడు పోతున్నాయి.

ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో విరివిగా అమ్ముతున్న బీజీ-3 విత్తనాలు గుజరాత్ నుంచి తెస్తున్నట్లు తెలుస్తుంది. గుంటూరు నుంచి ఉమ్మడి జిల్లా లోని వివిధ ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఇక్కడి నుంచి ప్రస్తుతం తెలంగాణ కు కూడా ఎక్కువ మొత్తంలో పత్తి విత్తనాలు వెళ్తున్నాయి.కొన్ని ప్రాసెసింగ్ యూనిట్లు కూడా రైతులను దగాచేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

తూతూ మంత్రమే...

వ్యవసాయ శాఖ నిర్వహించే దాడులు తూతూమంత్రంగా ఉన్నాయనే విమర్శలు ఉన్నాయి. కమిషనరేట్ ఆదేశాలతో ఆరంభం అయ్యే దాడుల వివరాలు కూడా విత్తనాల వ్యాపారులకు ముందే తెలుస్తాయన్న ఆరోపణలు ఉన్నాయి. దాడులకు వెళ్లే అధికారులు నామ్‌కే వాస్తేగా నమూనాలను సేకరిస్తున్నట్లు తెలుస్తుంది.

నాలుగు పళ్ల విభాగంలో మఠంపల్లి ఎడ్లజత విజయం

దాచేపల్లి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): దాచేపల్లి శ్రీ వీర్ల అంకమ్మ తల్లి కొలుపులతో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి ఎడ్ల బలప్రదర్శన పోటీల్లో ఆదివారం హోరాహోరీగా జరిగాయి. నాలుగుపళ్ల విభాగంలో తెలంగాణలోని సూర్యాపేట జిల్లా మఠంపల్లి గ్రామానికి చెందిన గాదె సుందరమ్మ, బాల్‌రెడ్డి మెమోరియల్, గాదె ఆషేర్, సుమన్‌బీ ఎడ్లజత, ఎన్టీఆర్ జిల్లా చందర్లపాడు మండలం తుర్లపాడుకు చెందిన పోకూరి ఆదినారాయణ సంయుక్త ఎడ్ల జత 5,059 అడుగులు దూరం బండను లాగి మొదటి స్థానంలో నిలిచాయి. నంద్యాల జిల్లా గడివేముల మండలం గడిగిరేవుల గ్రామానికి చెందిన పెరుమాళ్ల సంజయ్‌కుమార్ ఎడ్లజత 4,932 అడుగులతో రెండోస్థానం, గుంటూరు జిల్లా పెదకాకాని మండలం తక్కెళ్లపాడు గ్రామానికి చెందిన మోపర్తి వెంకటేశ్వరరావు అండ్ కంపెనీ, మోపర్తి నవీన్‌కుమార్ చౌదరి ఎడ్లజత 4,500 అడుగులతో మూడోస్థానం, పల్నాడు జిల్లా దాచేపల్లి మండలం కేశానుపల్లి గ్రామానికి చెందిన శ్రీకావ్య నంది బ్రీడింగ్ బుల్స్ సెంటర్ రామకోటయ్య ఎడ్ల జత 4,432 అడుగులతో నాలుగో స్థానం, పల్నాడు జిల్లా నరసరావుపేట మండలం విషప్పాలేనికి చెందిన బాషికారెడ్డి, జ్ఞాన్విత్‌రెడ్డి ఎడ్లజత 4,312 అడుగులతో ఐదోస్థానం, పల్నాడు జిల్లా సత్తెపల్లి మండలం భీమవరం గ్రామానికి చెందిన పసుమర్తి దివ్యశ్రీ ఎడ్లజత 3,850 అడుగులతో ఆరో స్థానం, బాపట్ల జిల్లా ఇంకొల్లు మండలం పూసపాడు గ్రామానికి చెందిన సూది బ్రదర్స్ ఎడ్లజత 3,750 అడుగులతో ఏడోస్థానం, బాపట్ల జిల్లా ఎద్దలపూడికి చెందిన మేస్త్రి ఖాదర్ మస్తాన్ బుల్స్ ఎడ్ల జత 3,316 అడుగులతో ఎనిమిదో స్థానంలో నిలిచాయి. మొదటి స్థానం సాధించిన ఎడ్లజతకు తక్కెళ్లపాడు గ్రామానికి చెందిన మహేశ్వరి ట్రేడర్స్ మేడపి నరసింహారావు రూ. 25 వేలు, రెండో బహుమతిని కొప్పుల నరసింహారావు, శ్రీనివాసరావు రూ. 20 వేలు, మూడో బహుమతి రూ. 15 వేలను గాలె హనుమంత్ కుమారులు అందజేశారు.


నాలుగుపళ్ల విభాగంలో బండ లాగుతున్న ఎడ్లజత

గుంటూరు మీదగా చర్లపల్లి, కాకినాడ, నరసపూర్‌కు ప్రత్యేక రైళ్లు

గుంటూరు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): వేసవి సెలవుల కారణంగా ప్రయాణికుల రద్దీ దృష్ట్యా గుంటూరు మీదగా చర్లపల్లి, కాకినాడ, నరసపూర్‌లకు ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌ఓ ఎ.శ్రీధర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. (07031) చర్లపల్లి - కాకినాడ టౌన్ ప్రత్యేక రైలు మే 2 నుంచి జూన్ 27వ తేదీ వరకు ప్రతి శుక్రవారం రాత్రి 7.20 గంటలకు బయలుదేరి సత్తెనపల్లి, గుంటూరు మీదగా మరుసటి రోజు వేకువజామున 4.30 గంటలకు కాకినాడ టౌన్‌కు చేరుకుంటుంది. (07032) కాకినాడ టౌన్ - చర్లపల్లి ప్రత్యేక రైలు మే 4 నుంచి జూన్ 29వ తేదీ వరకు ప్రతి ఆదివారం సాయంత్రం 6.55 గంటలకు బయలుదేరి గుంటూరు, సత్తెనపల్లి మీదగా మరుసటి రోజు ఉదయం 6.50 గంటలకి చర్లపల్లి చేరుకొంటుంది. (07233) చర్లపల్లి - నరసపూర్ ప్రత్యేక రైలు మే 2 నుంచి జూన్ 27వ తేదీ వరకు ప్రతి శుక్రవారం రాత్రి 7.15 గంటలకు బయలుదేరి నడికుడి, పిడుగురాళ్ల, సత్తెనపల్లి, గుంటూరు మీదగా మరుసటి రోజు వేకువజామున 5.50 గంటలకు నరసపూర్ చేరుకుంటుంది. (07234) నరసపూర్ - చర్లపల్లి ప్రత్యేక రైలు మే 4 నుంచి జూన్ 29వ తేదీ వరకు ప్రతి ఆదివారం రాత్రి 8 గంటలకు బయలుదేరి గుంటూరు, సత్తెనపల్లి, పిడుగురాళ్ల, నడికుడి మీదగా మరుసటి రోజు ఉదయం 8 గంటలకు చర్లపల్లి చేరుకుంటుంది.

స్టెమీ ఇంజక్షన్ సంజీవని వంటిది

● తెనాలి జిల్లా వైద్యశాలలో ఐసీఎంఆర్ బృంద సభ్యులు
● గుండెపోటు చికిత్సపై ఆరా..వైద్యుల పనితీరుపై సంతృప్తి

తెనాలిరూరల్, ఏప్రిల్28 (ఆంధ్రజ్యోతి): గుండెపోటుకు గురయ్యే రోగులకు మొదటి గంటలో స్టెమీ ఇంజక్షన్ అందిస్తే సంజీవనిలా ప్రాణాలు కాపాడుతుందని ఐసీఎంఆర్(ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్) బృంద సభ్యులు పేర్కొన్నారు. సోమవారం తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాలలో బృంద సభ్యులు స్టెమీ ఇంజక్షన్ ఇచ్చే విధానంపై వైద్యాధికారులతో సమావేశమయ్యారు. ఇంజక్షన్ భద్రపర చడం, వినియోగం, ఇంజక్షన్ అనంతరం రోగులకు కార్డియాలజీ డిపార్ట్‌మెంట్‌లో అందుతున్న వైద్య సేవలు, వారి ఆరోగ్య వివరాలను తెలుసుకున్నారు. ప్రభుత్వం ఇంజక్షన్‌ను అందుబాటులోకి తీసుకువచ్చినప్పటి నుండి ఇప్పటి వరకూ 60 మందికి అందించామని వైద్యా ధికారులు తెలిపారు. వారందరూ ఆరోగ్యంగా జీవిస్తున్నారని వివరించారు. దీంతో బృంద సభ్యులు సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం మీడియాతో సభ్యులు, న్యూఢిల్లీకి ఏయిమ్స్ కార్డియాలజిస్ట్ డాక్టర్ రామకృష్ణ, డాక్టర్ మీనాక్షి శర్మ మాట్లాడారు. గుండెపోటుకు గురైన వారిలో చాతి నొప్పి, ఎడమ భుజం లాగడం, ఆకస్మిక ఆయాసం, గుండెదడ, స్పృహ కోల్పోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయన్నారు. ఇవి ఉత్పన్నమైన మొదటి గంటలోపు రూ.45వేల స్టెమీ ఇంజక్షన్ అందిస్తే ప్రాణాలు నిలబెట్టుకోవచ్చన్నారు. వైద్యశాలలో వైద్యుల పర్యవేక్షణ బాగుందని, మరింత మంచి సేవలందించేలా కృషి చేయాలని సూచించారు. వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సౌభాగ్యవాణి, ఆర్‌ఎంఓ డాక్టర్ మల్లికార్జునరావు, డాక్టర్లు తిలకి వినీల్, డాక్టర్ శ్రీకాంత్, పలువురు వైద్యులు పాల్గొన్నారు.


వైద్యశాలలో వివరాలు సేకరిస్తున్న ఐసీఎంఆర్ బృంద సభ్యులు

విధేయతకే పట్టం

(5వ పేజీ తరువాయి)

ఎన్నిక ప్రక్రియ, ప్రమాణ స్వీకారం, బాధ్యతల స్వీకరణ అంతా గంటలోనే పూర్తయింది.

తెలుగుదేశం పార్టీకి విధేయుడిగా..

తెలుగుదేశం పార్టీకి విధేయుడిగా, పార్టీ కార్యక్రమాలను నడిపిస్తూ.. పార్టీ ఆదేశాలను శిరసా వహిస్తున్న కోవెలమూడి రవీంద్ర (నాని) గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ పీఠాన్ని అధిష్టించారు. ఆయనను మేయర్‌గా ఎంపిక చేసి గెలిపించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. దీంతో రంగంలో దిగిన కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ఈ ప్రక్రియను విజయవంతంగా పూర్తిచేశారు. తెలుగుదేశం పార్టీలో కోవెలమూడి నాని క్రియాశీలక పాత్ర పోషిస్తూ.. 20 ఏళ్లుగా పార్టీకి సేవలందిస్తూ వచ్చారు. కార్యకర్తగా, నాయకుడిగా, గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి బాధ్యతలను ఆయన సమర్థంగా నిర్వహించారు. పార్టీ కష్టకాలంలో కూడా ఆయన వెన్నంటి ఉండి, పార్టీ అభ్యున్నతికి తన వంతు కృషి చేశారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో గుంటూరు పశ్చిమ నియోజకవర్గం నుంచి టీడీపీ అభ్యర్థిగా ఆయన టికెట్ ఆశించారు. అయితే సామాజిక సమీకరణాల మూలంగా సీటు చేజారింది. బీసీ సామాజిక వర్గానికి చెందిన మాధవికి సీటు కేటాయించినా.. ఆమె గెలుపునకు నాని కృషి చేశారు.

గతంలో జరిగిన కార్పొరేషన్ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ బాగా దెబ్బతింది. పార్టీ తరపున 57 మంది కార్పొరేటర్లు పోటీ చేయగా కేవలం 8 మంది మాత్రమే గెలుపొందారు. ఈ సమయంలో గుంటూరు నగరపాలక సంస్థ ఫ్లోర్ లీడర్‌గా కౌన్సిల్లో నాని పార్టీ గళాన్ని వినిపించారు. గత సార్వత్రిక ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం గెలుపొందడంతో వైసీపీ కార్పొరేటర్లు కొంతమంది తెలుగుదేశంలో, మరికొందరు జనసేన పార్టీలో చేరారు. దీంతో స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో ఆరుగురు సభ్యులను కూటమి గెలుపొందింది.

అన్నీ తానై నడిపించిన.. పెమ్మసాని

నగర మేయర్ ఎన్నిక ప్రక్రియ మొదలు నుండి... నాని నగర మేయర్‌గా బాధ్యతలు చేపట్టే వరకు అన్ని తానై కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ముందుండి నడిపించారు. కార్పొరేటర్‌లను, ఎమ్మెల్యేలను, ఎమ్మెల్సీలను కలుపుకొని ముందుకు సాగారు. పార్టీ అధిష్టానం నిర్ణయం మేరకు నానీని మేయర్‌గా గెలిపించి ఆయనను ఆ స్థానంలో కూర్చోబెట్టారు.

వెల్లువెత్తిన అభినందనలు, గుంటూరులో భారీ ర్యాలీ

నగర మేయర్‌గా బాధ్యతలు చేపట్టిన కోవెలమూడి రవీంద్రను ప్రముఖులు కలిసి అభినందించారు. కేంద్రమంత్రి డాక్టర్ పెమ్మసాని, ఎమ్మెల్యేలు రామాంజనేయులు, మాధవి, నసీర్ అహ్మద్, నగర కమిషనర్ పులి శ్రీనివాసులు, జనసేన పార్టీ నాయకులు గాదె వెంకటేశ్వరరావు, బోనబోయిన శ్రీనివాస్ యాదవ్, టీడీపీ రాష్ట్ర నాయకులు మన్నవ మోహన్ కృష్ణ, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున అభినందనలు తెలిపారు. అభినందన కార్యక్రమం అంతా కోలాహలంగా సాగింది. అనంతరం జీఎంసీ నుంచి ప్రత్యేక వాహనంపై మేయర్ భారీ ర్యాలీ నిర్వహించారు. అభిమానులు, పార్టీ నాయకుల సంబరాల మధ్య.. భారీగా బాణసంచా కాలుస్తూ ఊరేగింపుగా సాగింది.

నేటి నుంచి ఎన్‌జీ రంగా

వ్యవసాయ వర్సిటీ వజ్రోత్సవాలు

● బ్రోచర్ ఆవిష్కరించిన వీసీ ఆచార్య శారద జయలక్ష్మీదేవి

లాంఫాం(తాడికొండ)ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం స్థాపించి 60 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా వజ్రోత్సవాలను నిర్వహిస్తున్నట్లు వీసీ ఆచార్య డాక్టర్ ఆర్.శారద జయలక్ష్మీదేవి తెలిపారు. సోమవారం వర్సిటీలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఉత్సవాల బ్రోచర్‌ను ఆమె ఆవిష్కరించారు. వజ్రోత్సవాలు మంగళ, బుధవారాలు రెండు రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర విభజన అనంతరం హైదరాబాద్ నుంచి లాంఫాంకు విశ్వవిద్యాలయం 2016లో మార్చబడిందని పేర్కొన్నారు. వర్సిటీ పరిధిలో ఏడు ప్రభుత్వ వ్యవసాయ కళాశాలలు, 6 అఫ్లియేటెడ్, రెండు ఫుడ్ సైన్స్, రెండు అగ్రి ఇంజినీరింగ్, కమ్యూనిటీ సైన్స్ కాలేజీ, 18 గవర్నమెంట్ అగ్రికల్చరల్ పాలిటెక్నిక్ కళాశాలలు, 40 ప్రైవేటు అగ్రికల్చరల్ పాలిటెక్నిక్ కాలేజీలు విస్తరించి ఉన్నాయని వెల్లడించారు. ఇప్పటి వరకు 503 నూతన వంగడాలు వివిధ పంటల్లో విడుదల చేయడం జరిగిందని చెప్పారు. విశ్వవిద్యాలయ పరిశోధన ఫలితాలు రైతులకు అందించడానికి వీలుగా ప్రతి జిల్లాకి ఒక విస్తరణ కేంద్రాన్ని ఏర్పాటు చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ అధికారులు పాల్గొన్నారు.


వజ్రోత్సవాల బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ శారద జయలక్ష్మీదేవి, అధికారులు

జడ్పీ సీఈవో బదిలీ.. ?

గుంటూరు సిటీ, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ సీఈవో జ్యోతిబసు స్థానచలనం జరగనున్నట్లు తెలుస్తున్నది. ఈ మేరకు ఉన్నత స్థాయిలో రంగం సిద్ధమైనట్లు సమాచారం. జ్యోతి బసు గుంటూరుకు వచ్చిన తరువాత అతి తక్కువ సమయం మాత్రమే జడ్పీ ఛైర్‌పర్సన్‌తో సఖ్యతగా ఉన్నారు. కొద్ది రోజులకే వివాదాలు పొడచూపాయి. ఈ నేపథ్యంలో ఛైర్‌పర్సన్ సీఈఓ పై ఉన్నత అధికారులకు ఫిర్యాదు చేశారు. జడ్పీలో జరుగుతున్న వివాదాలపై ముఖ్య నేతలు కూడా దృష్టి సారించారు. వారి చొరవతోనే మార్పులు చోటు చేసుకున్నట్లు చెబుతున్నారు. జ్యోతి బసు కూడా పంచాయతీ రాజ్ శిక్షణా కేంద్రానికి ప్రిన్సిపాల్‌గా వెళ్లేందుకు ప్రయత్నం చేస్తున్నట్లు తెలుస్తోంది. కొత్త సీఈఓ కోసం కూటమి ప్రభుత్వంలోని కీలకమైన నాయకులు పావులు కదుపుతున్నారని అంటున్నారు. ప్రకాశం జిల్లాలో పనిచేస్తున్న అధికారిని ఇక్కడకు తీసుకువచ్చేందుకు రంగం సిద్ధం అయ్యినట్లు తెలుస్తున్నది. ఆయన ఉమ్మడి గుంటూరు జిల్లాకు చెందిన వారు కావటంతో కొంతమంది ఆ విషయాన్ని ప్రస్తావిస్తున్నారు. సొంత జిల్లాకు చెందిన వారిని సీఈఓ పోస్టులో నియమిస్తే న్యాయ పరమైన సమస్యలు వస్తాయని వివాదం తీసుకొస్తున్నారు.

చలన చిత్ర అభివృద్ధికి అవరోధంగా టీవీ సీరియల్స్



- సినీ నటుడు సుబ్బరాయశర్మ

భట్టిప్రోలు (కొల్లూరు), ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): చలనచిత్ర అభివృద్ధికి టీవీ సీరియల్స్ అవరోధంగా మారాయని చలనచిత్ర క్యారెక్టర్ ఆర్టిస్టు ఉప్పులూరి సుబ్బరాయశర్మ విమర్శించారు. భట్టిప్రోలు మండల పరిధిలోని పల్లెకోనలో నిర్వహిస్తున్న పరుచూరి రఘుబాబు జాతీయ స్థాయి ఆహ్వాన నాటికల పోటీలకు సోమవారం ఆయన విచ్చేశారు. ఈ సందర్భంగా విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. చలన చిత్ర పరిశ్రమకు పూర్వ వైభవం రావాలంటే ప్రేక్షకుల్లోనే చైతన్యం రావాలన్నారు. కొన్ని ప్రాంతాల్లో సినిమా హాల్స్ కల్యాణ మండపాలుగా మారిపోవడం చూస్తున్నామన్నారు. దీనికి కారణం సినిమా పట్ల ప్రేక్షకులలో ఆదరణ తగ్గడమేనన్నారు. ఇప్పటి వరకు 200 పైగా సినిమాల్లో నటించడం జరిగిందన్నారు. ప్రస్తుతం ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ హీరోగా నటించిన హరిహర వీరమల్లు చిత్రంలో ఆయన కోరిక మేరకు నటిస్తున్నట్లు చెప్పారు. మజాకా సినిమాలో కూడా నటిస్తున్నట్లు చెప్పారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి


గండికోట వెంకట మణి పృథ్వీరాజ్(ఫైల్)

తెనాలి, మారీసుపేట, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి కూతవేటు దూరంలో యువకుడి మృతి కలకలం రేపింది. మల్లిపాడు పంచాయతీ పరిధిలోని వెలగగుంట చెరువులో ఓ యువకుడు విగతజీవుడైపడి ఉండటాన్ని సోమవారం స్థానికులు గుర్తించారు. సమాచారమివ్వగా ఘటనా స్థలాన్ని త్రీటౌన్ పోలీసులు పరిశీలించారు. మృతుడు జగ్గడిగుంటపాలెం ఎదురు ఉన్న టిడ్కో ఇళ్లలో నివాసం ఉండే.. గండికోట వెంకట మణి పృథ్వీరాజ్ (27)గా గుర్తించారు. సామాజిక మాధ్యమంలో మృతుడి వివరాలు పెట్టడంతో కుటుంబ సభ్యులు గుర్తించి పోలీసులను ఆశ్రయించారు. మృతుడు ఆటోడ్రైవర్‌గా పనిచేస్తుంటాడని, గత రాత్రి ఇంటిని నుండి వెళ్లి ఉదయం వరకు తిరిగి రాలేదని తల్లిదండ్రులు తెలిపారు. మృతికి గల కారణాలను పోలీసులు విచారిస్తున్నారు. ఘటనా స్థలంలో పగిలిన ఇటుకరాయి, కత్తి ఉండటాన్ని గుర్తించారు. మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభు త్వ వైద్యశాలకు తరలించారు. క్లూస్ టీం ఘటనా స్థలానికి చేరుకొని ఆధారాలను సేకరించింది. ఘటన జరిగిన రాత్రి కొందరు యువకులు ఈ ప్రాంతంలో మద్యం సేవించి, యువకుడిని హత్య చేసి పరారై ఉంటారని స్థానికులు భావిస్తున్నారు.

ఆరుగురుకి ఎంపీడీవోలుగా ప్రమోషన్

గుంటూరు సిటీ, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లాలోని మండల పరిషత్ కార్యాల యాల్లో వివిధ హోదాల్లో పనిచేస్తున్న ఆరుగురికి మండల అభివృద్ధి అధికా రులుగా ప్రమోషన్ లభిం చింది. ప్రమోషన్లు పొందిన వారిని ఉమ్మడి జిల్లాకే కేటాయించడం జరిగింది. ఎంపీడీవోగా ప్రమోషన్ పొందిన వారిలో దాచేపల్లిలో ఏవోగా పనిచేస్తున్న పీ రత్నం, గురజాలలో ఏవోగా పనిచేస్తున్న ఆర్ సాంబశివరావు, భట్టిప్రోలు డిప్యూటీ ఎంపీడీవో టీ ఊహారాణి, తుళ్లూరు డిప్యూటీ ఎంపీడీవో డేవిడ్ ప్రభాకర్, ప్రత్తిపాడు డిప్యూటీ ఎంపీడీవో జీ రవికుమార్, తాడేపల్లి డిప్యూటీ ఎంపీడీవో పీ రవికుమార్ ఉన్నారు. వీరిని ఏ మండలాలకు కేటాయించాలన్న విషయంపై జడ్పీ సీఈవో నిర్ణయం తీసుకుంటారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.30 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	130, 139, 150
చికెన్ విత్ స్కిన్(కిలో)	248.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	258.00

1,18,286 మిర్చి టిక్కీల విక్రయం

గుంటూరు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు సోమవారం 1,23,302 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 1,18,286 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 49,794 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	9500	13200
నంబరు.5	10000	12500
273	10000	12500
341	10000	13200
4884	10000	11300
సూపర్10	10000	12400
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
తేజ	10000	13700
షార్క్-1	10000	12200
బ్యాడిగి 355	10000	13000
సింజెంటా బ్యాడిగి 5531	---	---
దేవనూరుడీలక్స్	10000	12700
ఆర్మూరు	9800	11200
తాలుకాయలు	4500	6500

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ



మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నసీర్ అహ్మద్

వేసవిలో మజ్జిగ పంపిణీ అభినందనీయం

- ఎమ్మెల్యే నసీర్ అహ్మద్

గుంటూరు కార్పొరేషన్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): వేసవిలో ప్రజలకు మజ్జిగ పంపిణీ చేయడం అభినందనీయమని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ తెలిపారు. సోమవారం నంగడిగుంట రెడ్ల బజార్లో టీడీపీ నాయకుడు వాకా వీరారెడ్డి ఏర్పాటు చేసిన మజ్జిగ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ వేసవిలో ఇటువంటి మజ్జిగ కేంద్రాలు విస్తృతంగా ప్రారంభించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు జాగర్లమూడి శ్రీనివాసరావు, వాకా వీరారెడ్డి పాల్గొన్నారు.

అర్జీల పరిష్కారంలో అలసత్వం వహిస్తే చర్యలు

- డీఆర్వో షేక్ ఖాజావలీ
- ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 184 అర్జీలు
- పరిష్కరించాలంటూ ఆదేశాలు

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందిన అర్జీల పరిష్కారంలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని అధికారులను డీఆర్వో షేక్ ఖాజావలీ ఆదేశించారు. సోమవారం కలక్టరేట్‌లోని ఎస్ ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా 184 అర్జీలు వచ్చాయి. కలెక్టర్, జేసీ అందుబాటులో లేకపోవడంతో స్టెప్ సీఈవో చంద్రముని, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లక్ష్మీకుమారితో కలసి ఆయన అర్జీలను స్వీకరించారు. ఖాజావలీ మాట్లాడుతూ అర్జీల పరిష్కారంలో కొన్ని శాఖలు అలసత్వం వహిస్తున్నాయని, దీనిపై ఉన్నతాధికారులు అడిగినా పట్టించుకోవడం లేదన్నారు. అర్జీలు పెండింగ్‌లో ఉంటే అయా శాఖల అధికారులపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో డీఈవో రేణుక, డీఎస్‌వో కోమలి పద్మ, డీటీసీ సీతారామిరెడ్డి, వ్యవసాయ జేడీ వెంకటేశ్వర్లు, ఐసీడీఎస్ పీడీ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

- సంక్షేమ పథకాల అమల్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన సబ్సిడీ రుణాల మంజూరులో ఎదురవుతున్న అడ్డంకులను తొలగించాలని రజక వృత్తి దోబీఘాట్ల పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు చెన్నూరు చెన్నయ్య అర్జీ అందజేశారు. ప్రభుత్వం జారీ చేసిన నియమాల్లో సిబిల్ స్కోర్ లేదని కాకపోతే దీనిని అడ్డం పెట్టుకొని అధికారులు బ్యాంకులు రుణాలు మంజూరు చేయడం లేదని అన్నారు.

- ఐదు నెలల పెండింగ్ జీతాలు, బిల్లులు చెల్లించాలని మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ (సీఐటీయూ)ఆధ్వర్యంలో అర్జీ అందజేశారు. యూనియన్ నాయకురాలు రమణమ్మ మాట్లాడుతూ డిసెంబర్ నుంచి వేతనాలు లేక వంట బిల్లులు చెల్లించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. మెనూ చార్జీలు పెంచుతున్నట్టు ప్రకటన ఇచ్చినప్పటికీ ఇంతవరకు అమలు చేయలేదన్నారు. వినతి పత్రం అందజేసిన వారిలో దండా లక్ష్మీనారాయణ, ముక్తేశ్వరమ్మ, లక్ష్మి తదితరులు ఉన్నారు.




అర్జీదారులతో మాట్లాడుతున్న డీఆర్వో ఖాజావలీ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లక్ష్మీకుమారి తదితరులు

- గత ప్రభుత్వం చేపట్టిన రీ సర్వేలో రెవెన్యూ అధికారులు 900 ఎకరాలను ఇనాం భూములుగా మార్చేశారని వట్టిచెరుకూరు మండలం చమళ్లమూడి గ్రామ రైతులు అర్జీ అందజేశారు. వారు మాట్లాడుతూ దీనివల్ల 1బి, అడంగల్ మంజూరు కావడం లేదని, దీంతో బ్యాంకు రుణాలు, క్రయ, విక్రయాలు ఆగిపోయాయని వాపోయారు. వినతిపత్రం అందజేసిన వారిలో రంగారెడ్డి, అంజనేయులు, నరేంద్ర నాథ్, సుబ్బారావు పరమేశ్వరరావు తదితరులు ఉన్నారు.

- నివాసాలను కూల్చి వేస్తామని కొంతమంది బెదిరిస్తున్నారని యడ్లపాడు, కాటూరి వైద్య కళాశాల ఎదురుగా ఉన్న స్థానికులు అర్జీ అందజేశారు. ఈ మధ్య మా ఆడపిల్లల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్న గ్రామానికి చెందిన కొంతమందిపై కేసులు పెట్టామని వివరించారు. కోర్టులో మాకు అనుకూలంగా తీర్పు వస్తున్న సమయంలో ఆ కేసును ఉపసంహరించుకోవాలని లేదంటే మీ ఇళ్లను కూల్చివేస్తామని బెదిరిస్తున్నారని వాపోయారు. ఉన్నతాధికారులు స్పందించి తగు న్యాయం చేయాలని కోరారు.

- మద్రాస్‌లో ఏజీమెంట్ విభాగంలో సైనికునిగా పనిచేస్తూ 2006 సంవత్సరంలో పదవి విరమణ పొందానని, తనకు ప్రభుత్వం 1.35 ఎకరాలను కేటాయించిందని ఈ పొలాన్ని కాజేసేందుకు స్థానిక అధికారులు కుట్రపన్నుతున్నారని తాడికొండ మండలం, లాం గ్రామానికి చెందిన మాజీ సైనికుడు రాయపూడి కృపాచారి అర్జీ అందజేశారు. ఇటీవల తాడికొండ తహసీల్దార్ కలిసి విన్నవించుకోగా పట్టా కావాలంటే రూ.5 లక్షలు డిమాండ్ చేశారని అన్నారు. తాను అంత డబ్బు ఇవ్వలేనని చెప్పడంతో... 2024 నవంబరులో ఫణీంద్ర అనే వ్యక్తి పేరుతో భూమిని ఎక్కించి అమ్మేందుకు ప్రయత్నం చేస్తున్నారని, భూమి విలువ కోట్లలో ఉండడంతో భూమిని కాజేసే ప్రయత్నం చేస్తున్నారని వాపోయారు.


రైల్వేస్టేషన్‌లో నిర్మిస్తున్న మూడవ వంతెన

తెనాలి రైల్వేస్టేషన్‌కు.. నూతన సొబగులు

❖ అమృత్ భారత్ పథకంతో అభివృద్ధి
❖ మెరుగైన వసతులకు రూ.27.70 కోట్లు

నిర్మాణంలో ఉన్న ఏసీ వెయిటింగ్ హాలు




అంధుల కోసం వేసిన మార్గం

తెనాలి అర్బన్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : తెనాలి రైల్వేస్టేషన్ రూపురేఖలు మారుతున్నాయి. ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అమృత్ భారత్ పథకం ద్వారా అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. రూ.27.70 కోట్లతో ప్లాట్‌ఫారంల అభివృద్ధి, మూడవ వంతెన, ఎస్కలేటర్లు, లిఫ్టులు, అధునాతన టాయిలెట్లు, ఏసీ వెయిటింగ్ హాలు నిర్మాణ పనులు చేస్తున్నారు. ఢిల్లీ, హౌరా-చెన్నై మార్గంలో ప్రధానమైన తెనాలి రైల్వేస్టేషన్ మీదుగా నిత్యం 160 రైళ్లు ప్రయాణిస్తున్నాయి. 88 రైళ్లు ఆగే ఈ స్టేషన్ నుంచి రోజు 17 వేల మంది ప్రయాణిస్తుండగా టిక్కెట్ల ఆదాయంపైనే రోజు రూ.3 లక్షలు వస్తాయి.

మెయిన్ లైన్‌గా రెండవ ప్లాట్‌ఫారం

పెరిగిన ట్రాఫిక్ రద్దీని దృష్టిలో ఉంచుకుని రెండవ ప్లాట్‌ఫారం మెయిన్ లైనుగా మార్చుతున్నారు. మలుపుల కారణంగా 140 కి.మీ వేగంతో వెళ్లాల్సిన రైళ్లు 90 కి.మీ వేగంతో వెళుతున్నాయి. ఈ కారణంగా ఆలస్యం చోటు చేసుకుంటుంది. ఇందుకోసం వేగం పెంచేందుకు రెండవ ప్లాట్‌ఫారం మెయిన్‌లైన్‌గా మార్చి అభివృద్ధి చేస్తున్నారు.

12 మీటర్ల వెడల్పులో విశాలమైన బ్రిడ్జి

రైల్వేస్టేషన్‌లో ఇప్పటికే రెండు వంతెనలు ఉన్నాయి. ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని 12 మీటర్ల వెడల్పులో మరో బ్రిడ్జి నిర్మాణం చేపట్టారు. స్టేషన్ తూర్పు వైపు నుంచి పడమర వైపు బుకింగ్ వరకు విశాలమైన బ్రిడ్జి నిర్మిస్తున్నారు. బ్రిడ్జిపైన ట్రైన్ వచ్చే వరకు వేచి ఉండేందుకు అవసరమైన కుర్చీలు, దుకాణాలు కూడా ఏర్పాటు కానున్నాయి. ప్రతి ప్లాట్‌ఫారం చేరేందుకు ఎస్కలేటర్లు, లిఫ్టులు ఏర్పాటు చేస్తారు.

అధునాతన వెయిటింగ్ రూమ్

ఇప్పటి వరకు తెనాలి రైల్వేస్టేషన్‌లో సరైన వెయిటింగ్ రూమే లేదు. దీంతో ప్రయాణికులు రైళ్ల కోసం ప్లాట్‌ఫారంలపైనే దోమల బాధ భరిస్తూ వేచి ఉంటున్నారు. 1వ ప్లాట్‌ఫారంపై అధునాతన వెయిటింగ్ రూమ్ నిర్మిస్తున్నారు. రిజర్వేషన్ కౌంటర్ పక్కనే ఏసీ వెయిటింగ్ హాలు నిర్మాణం చేపట్టారు. 1వ ప్లాట్‌ఫాంపై అధునాతన పద్ధతిలో టాయిలెట్స్ నిర్మిస్తున్నారు. రైల్వే స్టేషన్‌కు వచ్చే అంధులు రైలు ఎక్కేందుకు మరొకరి సాయం లేకుండా మార్గం ఏర్పాటు చేస్తున్నారు. వారు గుర్తించేందుకు వీలుగా ఫ్లోరింగ్‌లో అవసరమైన టైల్స్ నిర్మించారు. స్టేషన్‌లో అడుగుపెట్టిన దగ్గర నుంచి ప్లాట్‌ఫారంపై రైలు ఎక్కే వరకు ప్రత్యేక టైల్స్‌తో దారి వేశారు.

ప్రయాణికులు వాహనాల పార్కింగ్, టిక్కెట్ల కొనుగోలు దగ్గర నుంచి స్టేషన్‌లో అన్ని రకాల దుకాణాలలో చేసే కొనుగోళ్లకు డిజిటల్ పద్ధతిలో చెల్లింపులకు ఏర్పాట్లు చేశారు.

చేతి వృత్తులు చేసుకునే వారికి రైల్వే స్టేషన్‌లో ఒక దుకాణం కేటాయించారు. 1 ప్రొడక్ట్ 1 స్టేషన్ పేరిట ఇక్కడ జ్యూట్ బ్యాగ్‌లు తయారు చేసి అమ్మే దుకాణాన్ని ప్రవేశంలోనే నిర్వహిస్తున్నారు.

6వ ప్లాట్‌ఫాం ఏర్పాటు

రైల్‌వికాస్ నిగమ్ లిమిటెడ్ పథకంలో 6వ ప్లాట్‌ఫాం నిర్మించనున్నారు. స్టేషన్‌లో ఆరు ట్రాక్‌లు ఉన్నప్పటికీ ఐదు ప్లాట్‌ఫాంలు మాత్రమే ఉన్నాయి. 6వ ట్రాక్‌ను గూడ్స్ రైళ్ల లోడింగ్, అన్‌లోడింగ్ కోసం వినియోగిస్తున్నారు. అక్కడ కూడా ప్లాట్‌ఫాం నిర్మించేందుకు ఏర్పాట్లు చేశారు.

ఆధునిక సిగ్నల్ వ్యవస్థ...

అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని రైల్వే శాఖ అందిపుచ్చుకుంది. 1వ ప్లాట్‌ఫారంకు రెండు వైపులా చివరన ఉన్న సిగ్నల్ క్యాబిన్స్‌ను తొలగించనున్నారు. అధునాతన కంప్యూటరైజ్డ్ సిగ్నల్ సిస్టమ్‌ను ఏర్పాటు చేసేందుకు కూడా చర్యలు చేపట్టారు. ఈ పనులన్నీ మరో మూడు నెలల్లో పూర్తి అవుతాయని స్టేషన్ మేనేజర్ వెంకటరమణ చెబుతున్నారు.


సిద్ధమవుతున్న ఆధునిక టాయిలెట్స్


ఆరవ ప్లాట్‌ఫారం నిర్మించనున్న ప్రదేశం

స్టడీ సర్టిఫికెట్ల కోసం.. పాట్లు

- డీఎస్సీ అభ్యర్థుల ఇక్కట్లు
- స్థానికత నిర్ణయంలో కీలకం
- పాఠశాలలకు వేసవి సెలవులు
- హెచ్‌ఎంలను ఫోన్లలో సంప్రదింపులు



సత్తెనపల్లి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ -2025 రిక్రూట్‌మెంట్ కోసం సిద్ధమవుతున్న అభ్యర్థులు స్టడీ సర్టిఫికెట్ల కోసం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేటప్పుడు మిగతా ధృవీకరణ పత్రాలతో పాటు.. నాలుగు నుంచి పదవ తరగతి వరకు స్టడీ సర్టిఫికెట్లను అప్‌లోడ్ చేయాల్సి ఉంది. ప్రస్తుతం పాఠశాలలకు వేసవి సెలవులు కావడంతో తాము చదివిన పాఠశాలల నుంచి స్టడీ సర్టిఫికెట్లను పొందేందుకు ఆయా పాఠశాలలో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అభ్యర్థులకు అందుబాటులో ఉండడం లేదు. డీఎస్సీకి దరఖాస్తుల స్వీకరణ ఇప్పటికే ప్రారంభం కాగా, మే 15తో ముగియనుంది. ఈలోగా వేసవి సెలవులు ముగిసే అవకాశం లేకపోవడంతో హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులను ఫోన్ల ద్వారా అభ్యర్థులు సంప్రదిస్తున్నారు.

30ఏళ్ల నాటి సర్టిఫికెట్ల కోసం వెతుకులాట

డీఎస్సీకి దరఖాస్తు చేసుకునేందుకు అభ్యర్థుల వయో పరిమితి 44 సంవత్సరాలకు పెంచారు. సంబంధిత వయసు కల్గిన అభ్యర్థులు 35 సంవత్సరాల క్రితం ప్రాథమిక పాఠశాల, ఉన్నత పాఠశాలలో స్టడీ సర్టిఫికెట్ల కోసం వెతుకులాట మొదలు పెట్టారు. అభ్యర్థుల స్థానికతను నిర్ధారించేందుకు స్టడీ సర్టిఫికెట్లనే ప్రామాణికంగా తీసుకుంటారన్న విషయం తెలిసిందే. ఈ ధృవపత్రాల ప్రకారమే అభ్యర్థుల లోకల్, నాన్ లోకల్ స్టేటస్‌ను ఉద్యోగ ఎంపికలో నిర్ణయిస్తారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో సర్టిఫికెట్లు తీసుకోవాలంటే అభ్యర్థులు ఆయా సంవత్సరాల్లో చదివిన తరగతుల రికార్డులు, రిజిష్టర్లను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పరిశీలించి ధృవీకరించాల్సి ఉంది. ఉన్నత పాఠశాలల్లో మాత్రం స్టడీ సర్టిఫికెట్ల ఇస్తున్నారు. అభ్యర్థులు ఈ ఇబ్బందులకు ప్రభుత్వం పరిష్కారం చూపాలని కోరుతున్నారు. దీనిపై ఎంఈఓ శ్రీనివాసరావును ఆంధ్రజ్యోతి వివరణ కోరగా అభ్యర్థులు తమ దృష్టికి తెస్తే 4, 5 తరగతుల స్టడీ సర్టిఫికెట్లను హెచ్‌ఎంలతో మాట్లాడి ఇప్పిస్తామని తెలిపారు.

మాచర్ల మున్సిపల్ వైస్‌చైర్మన్‌గా మదార్ సాహెబ్

ఏకగ్రీవంగా ఎన్నిక

మాచర్లటౌన్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మాచర్ల మున్సిపాలిటీ వైస్ చైర్మన్-1గా 27వ వార్డు కౌన్సిలర్ షేక్ మదార్‌సాహెబ్‌ను కౌన్సిల్ సభ్యులు సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సోమవారం జరిగిన వైస్ చైర్మన్ ఎన్నికల అధికారిగా గురజాల ఆర్డీవో మురళీకృష్ణ, అబ్జర్వర్‌గా జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ వ్యవహరించారు. మున్సిపల్ కౌన్సిల్ సమావేశ మందిరంలో జరిగిన కౌన్సిల్ సమావేశంలో మదార్‌సాహెబ్‌ను వైస్‌చైర్మన్‌గా బలపరుస్తూ మొత్తం 31 మందికి గాను ఇందులో 21 మంది కౌన్సిలర్లు టీడీపీలో చేరి ఆమోదం తెలిపారు. 17వ వార్డు కౌన్సిలర్ పోలూరి నరసింహారావు.. వైస్ చైర్మన్-1గా మదార్‌సాహెబ్‌ను ప్రతిపాదించగా 1వ వార్డు కౌన్సిలర్ గట్ల అరుణకుమారి, 21వ వార్డు కౌన్సిలర్ ముదిశెట్టి శ్రీనివాసరావులు బలపరిచారు. దీంతో మదార్‌సాహెబ్ ఎన్నిక ఏకగ్రీవమైంది. గురజాల ఆర్డీవో మురళీకృష్ణ మదార్ సాహెబ్‌కు డిక్లరేషన్ ఫారం అందించారు. అనంతరం మదార్‌సాహెబ్ పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ కార్యక్రమానికి ఎక్స్‌అఫిషియో మెంబర్‌గా హాజరైన ఎమ్మెల్యే జూలకంటి.. మదార్‌సాహెబ్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

నిరంకుశత్వం నుంచి ప్రజాస్వామ్యం వైపు..

ఈ సందర్భంగా ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ, వైసీపీ ప్రభుత్వ హయాంలో మాచర్ల మున్సిపాలిటీలో నిరంకుసత్వం రాజ్యమేలిందన్నారు. మున్సిపల్ ఎన్నికల సమయంలో నామినేషన్ వేయడానికి వచ్చిన టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులపై దాడులు చేసి, కేసులు పెట్టి మరీ 31 వార్డుల్లో 31 మంది వైసీపీ నాయకులను కౌన్సిలర్‌లుగా ఏకగ్రీవం చేసి ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ 10 నెలల కూటమి ప్రభుత్వంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి వైసీపీ కౌన్సిలర్లు స్వచ్ఛందంగా వచ్చి టీడీపీలో చేరుతున్నారని ఆనందం వ్యక్తం చేశారు. మాచర్ల మున్సిపాలిటీ సర్వతో ముఖంగా అభివృద్ధి సాధించే దిశగా కౌన్సిల్ పనిచేయాలని సూచించారు.

వైస్ చైర్మన్ - 1 ఎన్నిక దృష్టిలో ఉంచుకొని కౌన్సిలర్లను కూడగట్టడంలో టీడీపీ సీనియర్ నాయకుడు యెనుముల కేశవరెడ్డి సమర్థవంతంగా వ్యవహరించారు. ఈ సందర్భంగా కేశవరెడ్డిని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ప్రత్యేకంగా అభినందించారు.


మదార్‌సాహెబ్‌కు డిక్లరేషన్ ఫారం అందజేస్తున్న ఆర్డీవో మురళీకృష్ణ

ఇచ్చిన మాటకు కట్టుబడి ఉంటారు : వైస్ చైర్మన్ మదార్‌సాహెబ్

జూలకంటి నాగిరెడ్డి, దుర్గాంబ హయాం నుంచి జూలకంటి కుటుంబం ప్రజలకు ఇచ్చిన మాటకు కట్టుబడి ఉంటోందని మదార్‌సాహెబ్ పేర్కొన్నారు. ఆ వారసత్వం నుంచి వచ్చిన ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి ఇచ్చిన మాట ప్రకారం తనకు వైస్ చైర్మన్ పదవిని కానుకగా ఇచ్చారని తెలిపారు. అనంతరం మదార్‌సాహెబ్ కుటుంబసభ్యులు ఎమ్మెల్యే జూలకంటికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కిరణ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ వేణుబాబు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ప్రధాని సభకు.. మంత్రులకు బాధ్యతలు

- నేడు సమీక్షించనున్న ఆర్‌అండ్‌బీ మంత్రి
- మంగళగిరి వైపు నుంచి వచ్చే ప్రజల బాధ్యత మంత్రి గొట్టిపాటికి
- రాజధానిలో మనోహర్ రచ్చబండ కార్యక్రమాలు
- ఏర్పాట్లను పర్యవేక్షించిన కలెక్టర్

గుంటూరు, తుళ్లూరు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): అమరావతి రాజధాని పనుల పునరుద్ధరణకు శంకుస్థాపన చేసేందుకు ప్రధాని నరేంద్ర మోదీ రానుండటంతో నియోజకవర్గాల వారీగా జనసమీకరణ చేసే బాధ్యత సీఎం చంద్రబాబు మంత్రులకు కేటాయించారు. గుంటూరు తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల నుంచి భారీ సంఖ్యలో జనసమీకరణ చేయాల్సిందిగా రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధనరెడ్డికి కేటాయించారు. దీంతో ఆయన మంగళవారం ఉదయం 9.30 గంటలకు గుంటూరు నగరపాలకసంస్థ కార్యాలయానికి వచ్చి జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి, కమిషనర్ పులి శ్రీనివాసులు, పోలీసు, రెవెన్యూ, మునిసిపల్, రోడ్లు, భవనాలు, డీఆర్‌డీఏ, మెప్మా తదితర శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించాలని నిర్ణయించారు. ఈ మేరకు ఆయన సోమవారం జిల్లా కలెక్టర్‌కు ఫ్యాక్స్ ద్వారా సమాచారం అందించారు. సమావేశానికి ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లను కూడా హాజరయ్యేలా చూడాలని విజ్ఞప్తి చేశారు.

మంగళగిరి మీదగా వచ్చే ప్రజలు బహిరంగ సభ జరిగే ప్రదేశానికి చేరుకోవడానికి ఎలాంటి ఇబ్బందులు పడకుండా ఉండేలా చూడాల్సిందిగా రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు బాధ్యతలు కేటాయించారు. దాంతో ఆయన సోమవారం మంగళగిరిలోని టీడీపీ రాష్ట్ర కార్యాలయంలో బీజేపీ, జనసేన నాయకులతో కలిసి సమీక్ష నిర్వహించారు.

మరోవైపు పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ సోమవారం రాజధానిలోని ఎర్రబాలెం, బేతపూడి, ఐనవోలులో పర్యటించి రచ్చబండ కార్యక్రమాలు నిర్వహించారు. జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించి ప్రధాని సభను పండగ వాతావరణంలో నిర్వహించడం జరుగుతుందన్నారు. ఆ సభని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

కాగా జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి సోమవారం సాయంత్రం వెలగపూడిలో పర్యటించి ప్రధాని సభ ఏర్పాట్లను పరిశీలించారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్ వీరపాండియన్, గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి, ఎస్పీ సతీష్‌కుమార్‌తో కలిసి పరిశీలించారు. సభా ప్రాంగణం వద్ద చేపట్టాల్సిన ఏర్పాట్లు, వీవీఐపీలు, ప్రజలు ప్రయాణించే మార్గాలు, వాహనాల పార్కింగ్‌కు సంబంధించి ప్రాంతాలను పరిశీలించి చేపట్టాల్సిన ఏర్పాట్లపై అధికారులతో చర్చించి సూచనలు జారీ చేశారు.


మంగళగిరి మండలం బేతపూడిలో జరిగిన రచ్చబండలో మాట్లాడుతున్న మంత్రి నాదెండ్ల మనోహర్


మంగళగిరి టీడీపీ కార్యాలయం డాక్టర్ ఎమ్మెస్సెస్ భవన్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి గొట్టిపాటి రవికుమార్


ప్రధాని పర్యటన ఏర్పాట్లపై అధికారులతో చర్చిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

యార్డుకు రక్షణ ఏదీ

- కూలిన ప్రహరీ.. ఇసుక దిబ్బలు
- నాటి వైసీపీ నాయకుల నిర్వాకం
- ఇసుక వ్యాపారానికి వాడుకున్న వైనం

శుభ్రం చేయకుండా వదిలివేసిన యార్డు స్థలం



వేమూరు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : వేమూరు మార్కెట్ యార్డుకు రక్షణ కొరవడింది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నాటి నాయకులు యార్డు స్థలాన్ని ఇష్టారాజ్యంగా వాడుకుని నాశనం చేశారు. కోట్లాది రూపాయలు దండుకునేందుకు యార్డు స్థలాన్ని ఇసుక డంపింగ్ కోసం వాడుకున్నారు. అనధికారికంగా వేయింగ్ మిషన్ ఏర్పాటు చేశారు. ఖాళీ స్థలం అంతా ఇసుక గుట్టలు మేటలుగా వేయడంతో ప్రహరీ గోడలకు ఒత్తిడి ఏర్పడి అవి పడిపోయాయి. అనంతరం వాటిని ఆనాడు చైర్మన్‌గా పని చేసిన వ్యక్తి తూతూమంత్రంగా నిర్మించాడు. నాణ్యత ప్రమాణాలు పాటించకుండా గోడలు నిర్మించడం వల్ల తిరిగి అవి ఎక్కడికక్కడ పడిపోయాయి. రైతులకు ఉపయోగపడాల్సిన యార్డు ఇలా అవడానికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలసిన రైతులు డిమాండ్ చేస్తున్నారు.


తూతూ మంత్రంగా నిర్మించడంతో మళ్లీ పడ్డ గోడ


యార్డు ప్రాంగణంలో ఇసుక డంపింగ్ వల్ల పడిపోయిన ప్రహరీ


వైసీపీ నేతలు అనధికారికంగా ఏర్పాటు చేసిన వేయింగ్ మిషన్

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు

పన్నుల గోల్‌మాల్‌పై విచారణ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

పొన్నూరు టౌన్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు మండలంలోని మూడు గ్రామ పంచాయతీల్లో పన్నుల సొమ్ము గోల్‌మాల్ అంటూ ఆంధ్రజ్యోతి పత్రికలో వచ్చిన కథనంపై సోమవారం ఈవోపీఆర్డీ కె.మల్లికార్జునరావు విచారణ చేపట్టారు. మండల పరిధిలోని చింతలపూడి, మాచవరం, ములకుదురు గ్రామ పంచాయతీల్లో పన్నుల రికార్డులు తనిఖీచేసి వసూలైన పన్నులు ట్రెజరీకి జమచేసిన నిధుల వివరాలను తనిఖీ చేశారు. విచారణలో వెలుగుచూసిన అంశాలను జిల్లా ఉన్నతాధికారులకు నివేదిక ఇవ్వనున్నట్లు ఈవోపీఆర్డీ వివరించారు.

గంజాయి కేసులో నిందులకు జరిమానా

తెనాలి రూరల్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): గంజాయి కేసులో నిందితులు ఇద్దరికి న్యాయస్థానం జరిమానా విధించింది. రూరల్ ఎస్ఐ ఆనంద్ తెలిపిన వివరాల ప్రకారం గంజాయి విక్రయిస్తున్న కేసులో తెనాలి మారీసుపేటకు చెందిన షేక్ నాగూర్, నిజాంపట్నం పాలపర్తికి చెందిన గంగుల దుర్గాప్రసాద్‌లను 2020లో అప్పటి సీఐ అశోక్‌కుమార్, ఎస్ఐ మురళిలు అరెస్టుచేసి వారి వద్ద 500గ్రాముల గంజాయిని సీజ్ చేశారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టి నిందితులను కోర్టు ఎదుట హాజరు పర్చారు. ఈ కేసును ప్రాసిక్యూషన్ తరుపున పరిసపోగు సునీల్ వాదనలు వినిపించగా న్యాయస్థానం ఇద్దరు నిందితులకు ఒకొక్కరికి రూ.5000వంతున జరిమానా విధిస్తూ న్యాయమూర్తి పి.రాజశేఖర్ సోమవారం తీర్పు ఇచ్చినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

భర్త వేధింపులపై ఫిర్యాదు

తెనాలి, మారీసుపేట, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): భర్త అదనపు కట్నం తేవాలని వేధింపులకు గురిచేస్తున్నాడన్న ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. సోమవారం వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం స్థానిక పోతురాజు కాలనీకి చెందిన నిర్మల రాణి శ్రీకాకుళంనకు చెందిన నిమ్మల తరుణ్‌లు 2023లో ప్రేమ వివాహం చేసుకున్నారు. కొంతకాలం తెనాలిలో బేలుదారి మేస్త్రీగా పనిచేశాడు. అనంతరం తరుణ్ తన సొంత ఊరైన శ్రీకాకుళంలో భార్య నిర్మల రాణితో కలసి కాపురం పెట్టాడు. ఆమె గర్భవతి అయినతర్వాత అదనపు కట్నం తేవాలని మానసికంగా, శారీరకంగా హింసిస్తున్నాడు. అవి భరించలేక పుట్టిల్లు తెనాలికి వచ్చి పోలీసులను ఆశ్రయించింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

తెనాలిరూరల్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): పురుగు మందు తాగి వైద్యశాలలో చికిత్స పొందుతున్న వ్యక్తి మృతిచెందిన ఘటనపై కేసు నమోదు చేసినట్లు రూరల్ పోలీసులు తెలిపారు. మండలంలోని కొలవరం గ్రామానికి చెందిన లక్ష్మిశెట్టి శ్రీకాంత్ (36) వ్యవసాయ పనులు చేస్తూ ఖాళీ సమయంలో సెంట్రింగ్ పనికి వెళ్తుంటాడు. ఇతడికి వివాహమై ఇద్దరు పిల్లలున్నారు. భార్య భర్తల మధ్య చిన్నపాటి మనస్పర్థలు చోటుచేసుకోవడంతో మనస్థాపానికి గురైన శ్రీకాంత్ సోమవారం పురుగు మందుతాగాడు. గమనించిన భార్య, కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా సాయంత్రం మృతిచెందాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదుమేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఆనంద్ పేర్కొన్నారు.

ఈతకు వెళ్లిన యువకుడు గల్లంతు

తెనాలి రూరల్, ఏప్రిల్ 28: ఈతకు వెళ్లి యువకుడు గల్లంతైన ఘటన సంగంజాగర్లమూడి కొమ్మమూరు కాలువ వద్ద చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం తెనాలి చెంచుపేటకు చెందిన ప్రసాద్ (23) తన స్నేహితులతో కలిసి సోమవారం సంగంజాగర్లమూడి శ్రీసంగమేశ్వరస్వామి ఆలయం ఎదురుగా ప్రవహిస్తున్న కొమ్మమూరు కాలువలో ఈతకు వచ్చారు. నీటి ప్రవాహం అధికంగా ఉండటంతో ప్రసాద్ గల్లంతయ్యాడు. అతడితో వచ్చిన ముగ్గురు స్నేహితులు స్థానికుల సాయంతో కాపాడే ప్రయత్నం చేసినా ప్రయోజనం లేకుండా పోయింది. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా...

● తెనాలి అర్బన్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ప్రకాశం రోడ్డులోని జేవీఎస్ క్రాంతి కోచింగ్ సెంటర్‌లో పాలిటెక్నిక్ అవగాహన సదస్సు, మోడల్ పరీక్ష నిర్వహించారు. 215 మంది విద్యార్థులు పాల్గొన్న పరీక్షల్లో విజేతలకు నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మాజీ వైస్ చాన్సలర్ గుజ్జర్లమూడి కృపాచారి డైరెక్టర్ విజయశేఖర్, రిసోర్స్ పర్సన్స్ రమేష్‌రెడ్డి పాల్గొన్నారు.

● కొల్లిపర: తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ఎనిమిది దరఖాస్తులు వచ్చినట్లు ఇన్‌చార్జి తహసీల్దార్ ఉప్పాల రాజేష్ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో విజయలక్ష్మి, ఈవోపీఆర్‌డీ భార్గవ్, ఎంఈవో సాల్మన్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

● తెనాలి అర్బన్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో సోమవారం సరస్వతీ శిశు మందిర్ విద్యార్థుల పట్టా ప్రదాన వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ శాస్త్రవేత్త చందు సాంబశివరావు, సంచాలిత సమితి అధ్యక్షుడు సామల లక్ష్మణబాబు, సమితి గౌరవ అధ్యక్షులు కొత్త సుబ్రహ్మణ్యం, యర్రంశెట్టి హనుమంతరావు, వెంకటసుబ్బారావు, లత, రమాదేవి ప్రసంగించారు.

● కొల్లిపర: ప్రభుత్వ ఆదేశాల మేరకు మండల కేంద్రం కొల్లిపరలో త్వరలో కుట్టు శిక్షణా కేంద్రాన్ని ప్రారంభించనున్నట్లు ఎంపీడీవో విజయలక్ష్మి తెలిపారు. సోమవారం మండల కేంద్రం కొల్లిపరలో కుట్టు శిక్షణ ఏర్పాటుకు ఆమె స్కూలు భవనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ భార్గవ్, డీఆర్‌డీఏ ఏపీఎం రమాదేవి, పంచాయతీ కార్యదర్శి ఆలకనందు తదితరులు పాల్గొన్నారు.

వ్యవస్థలను నిర్వీర్యం చేసిన జగన్

● ప్రధాని మోడీ బహిరంగ సభను జయప్రదం చేయాలి
● రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, వేదికపై ఎమ్మెల్యేలు నరేంద్ర, నాగేశ్వరరావు తదితరులు

పెదకాకాని, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): వ్యవస్థలను మాజీ సీఎం జగన్మోహనరెడ్డి నిర్వీర్యం చేశాడని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఆరోపించారు. సోమవారం పెదకాకాని మండల తెలుగుదేశం పార్టీ కార్యాలయం వద్ద ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సమావేశానికి పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మంత్రి రామానాయుడు మాట్లాడుతూ అమరావతి రాజధాని నిర్మాణాన్ని త్వరలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పూర్తి చేస్తారని, అందుకు ప్రధాని నరేంద్ర మోడీ పూర్తి సహకారం అందిస్తారని అన్నారు. మే 2న రాజధానిలో జరిగే ప్రధానమంత్రి నరేంద్ర మోడీ బహిరంగ సభను ప్రతి ఒక్కరూ జయప్రదం చేయాలని ఆయన కోరారు. అమరావతి పునర్నిర్మాణం కోసం చంద్రబాబు నాయుడు విశేషంగా కృషి చేస్తున్నారన్నారు. పొన్నూరు నియోజకవర్గంలో నుంచి పెద్దఎత్తున పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు తరలిరావాలన్నారు. వైసీపీ హయాంలో రాజధాని విషయంలో మహిళలను బూటు కాళ్లతో తన్నారని, ఎంతో దుర్మార్గంగా, రాక్షసంగా వ్యవహరించారన్నారు. ప్రజల ఆశీర్వాదంతో ప్రధానమంత్రి మోడీ సహకారంతో రాజ్య నిర్మాణం జరుగుతుందన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో జరిగే అమరావతి పునర్నిర్మాణ శంకుస్థాపన సభను విజయవంతం చేయాలన్నారు. ఎమ్మెల్యే నరేంద్ర కుమార్ మాట్లాడుతూ జగన్ రాజధానిగా అమరావతి నిర్మాణంపై మద్దతు తెలిపి అధికారం చేపట్టిన తరువాత మాట, మడమ తిప్పారన్నారు. అంతేకాకుండా అమరావతి ఒక ఎడారిగా చిత్రించి అమరావతిని సర్వనాశనం చేసిన సంగతి తెలిసిందేనన్నారు. ఆనాడు అమరావతి కోసం భూములిచ్చిన రైతులను ఎంతగా హింసించారో అందరికీ తెలిసిందేనన్నారు. సైకో జగన్ మోహన్‌రెడ్డి రాక్షస పాలనకు చరమగీతం పాడారన్నారు. చంద్రబాబు నేతృత్వంలో నిలిచిపోయిన అమరావతిని నిర్మించుకుందామన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోడీ విచేస్తున్న శంకుస్థాపన కార్యక్రమానికి వేలాదిగా కార్యకర్తలు తరలిరావాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో పొన్నూరు నియోజకవర్గ పరిశీలకులు కందుకూరు నియోజకవర్గం శాసనసభ్యుడు ఇంటూరి నాగేశ్వర్రావు, పొన్నూరు నియోజకవర్గ నాయకులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థిక స్థితిగతులను మెరుగుపరిచేందుకు మెప్మా బజార్లు

● మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక

తెనాలి, మారీసుపేట, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మహిళల ఆర్థిక స్థితిగతులను మెరుగుపరిచేందుకు మెప్మా బజార్లను ఏర్పాటు చేశామని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక అన్నారు. సోమవారం స్థానిక మార్కెట్ సెంటర్‌లో పురపాలక సంఘ మెప్మా విభాగం వారు ఏర్పాటుచేసిన మెప్మా అర్బన్ మార్కెట్‌ను మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక మున్సిపల్ మెప్మా మేనేజర్ అధికారులతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ రాధిక మాట్లాడుతూ డ్వాక్రా మహిళలు మెప్మా ద్వారా వివిధ బ్యాంకుల నుంచి రుణాలు తీసుకొని ఇంటి వద్దే ఉత్పత్తులను తయారు చేసుకొని చిన్న వ్యాపారాలు చేసుకోవడం ద్వారా ఆర్థిక స్వాలంబన పొందవచ్చన్నారు. వివిధ సహాయక సంఘ సభ్యులు ఉత్పత్తిచేసిన పిండి వంటలు, పచ్చళ్లు, ఫ్యాన్సీ వస్తువులు, బ్యాగ్‌లు, గాజుల స్టాల్స్‌ను సందర్శించి వాటి నాణ్యతను పరిశీలించారు. స్వయం సహాయక సభ్యులు తయారుచేసిన ఉత్పత్తులను తక్కువ ధరకే విక్రయిస్తున్నారని ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని అన్నారు.

కార్యక్రమంలో మెప్మా సీఎంఎం విజయకుమారి, మెప్మా సిబ్బంది, స్వయం సహాయక సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

తెనాలిలో మాజీ మంత్రి కోడెల ఫైబర్ విగ్రహం రూపకల్పన



తెనాలి అర్బన్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): తెనాలి సూర్య శిల్పశాల శిల్పులు మాజీ మంత్రి దివంగత కోడెల శివప్రసాదరావు ఫైబర్ గ్లాసు విగ్రహాన్ని రూపొందించారు. కోటప్పకొండలోని కమ్మ సత్రంలో ఆవిష్కరించేందుకుగాను పది అడుగుల ఎత్తులో ఈ విగ్రహాన్ని తయారు చేశారు. మే 2న కోడెల జయంతి పురస్కరించుకుని విగ్రహాన్ని ఆవిష్కరించనున్నట్లు, ఇందుకు గాను తమకు తయారీ ఆర్డర్ లభించిందని శిల్పులు కాటూరి వెంకటేశ్వరరావు, రవిచంద్ర తెలిపారు.

← శివప్రసాద్ విగ్రహంతో శిల్పులు



రికార్డులను తనిఖీ చేస్తున్న డీఎల్‌పీవో స్వరూపరాణి

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి: డీఎల్‌పీవో స్వరూపరాణి

కొల్లిపర, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని డీఎల్‌పీవో వి.స్వరూపరాణి ఆదేశించారు. సోమవారం మండల పరిధిలోని తూములూరు, కొల్లిపర, అన్నవరంలంక పంచాయతీ కార్యాలయాల్లో ఆమె తనిఖీ నిర్వహించారు. రికార్డులను పరిశీలించి పంచాయతీ సిబ్బందికి పారిశుధ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా స్వరూపరాణి మాట్లాడుతూ స్వచ్ఛ సంపద ప్రాధాన్యంను ప్రజలకు అవగాహన కలిగించాలన్నారు. రోడ్లపక్కన చెత్తచెదారం లేకుండా చూసుకోవాలన్నారు. కాల్వల్లో మురుగునీరు తొలగింపుపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. రోడ్డుపక్కన వ్యర్థాలను కాల్చితే తగిన చర్యలు తీసుకోనున్నట్లు హెచ్చరించారు. తడిచెత్తను, పొడిచెత్తను తప్పనిసరిగా వేరు చేయాలన్నారు. తనిఖీలో ఈవోపీఆర్‌డీ భార్గవ్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ముగిసిన వేసవి వినోద శిక్షణ

పొన్నూరు టౌన్, ఏప్రిల్, 15 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు పట్టణంలోని నిడుబ్రోలు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన వేసవి వినోద శిక్షణ కార్యక్రమం సోమవారంతో ముగిశాయి. ఈ నెల 24నుంచి ప్రతి రోజూ విద్యార్థులకు సైన్స్ మ్యాజిక్ క్యాలిగ్రఫీ రైటింగ్, వృథాగా ఉన్న వస్తువులతో సైన్స్ ప్రయోగాలు, మట్టితో కళాకృతుల రూపకల్పన వంటి పలు అంశాలపై విద్యార్థులకు శిక్షణనిచ్చారు. కార్యక్రమంలో రిసోర్స్‌పర్సన్ రావిపాటి శివనాగేశ్వరరావు, టీవీ శ్రీనివాస్, లక్ష్మణరావు, మోహన్, సుమలత, కె శివనాగేశ్వరరావు, తాతా సాంబశివరావు, నన్నపనేని వెంకటేశ్వర్లు, పాఠశాల హెచ్ఎం డి.శివలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలను ఆదరించాలి: కిషోర్

పొన్నూరు టౌన్, ఏప్రిల్, 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలను ఆదరించాలని బహుజన సమాజ్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ యాతాటి కిషోర్ అన్నారు. పట్టణంలోని నిడుబ్రోలులో కొండముది రోడ్డులో ఉన్న మున్సిపల్ హైస్కూల్‌లో పది పరీక్షా ఫలితాల్లో ప్రథమ స్థానంలో నిలిచిన పాలపర్తి భార్గవిని సోమవారం అభినందించారు. భార్గవి నిరుపేద కుటుంబంలో పుట్టినప్పటికీ పదో తరగతిలో 569 మార్కులతో పాఠశాలలో ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. భార్గవిని యాతాటి కిషోర్ ఘనంగా సత్కరించి, రు.2500నగదు బహుమతి అందజేశారు.

గోశాలకు వంద బ్యాగ్‌ల దాణా వితరణ

తెనాలి అర్బన్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మానవతా సంస్థ ఆధ్వర్యంలో గోశాలకు సోమవారం వంద బ్యాగ్‌ల దాణా అందజేశారు. బుర్రిపాలెం రోడ్డులోని గోశాలలో సంస్థ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. చైర్మన్ కొలసాని రాంచంద్ మాట్లాడుతూ, తమ సంస్థ సేవా కార్యక్రమాల్లో భాగంగా దాణా పంపిణీ చేశామన్నారు. గోవులను సంరక్షిస్తున్న ప్రకాష్ జైన్ కుటుంబ సభ్యులను అభినందించారు. ప్రసాద్, వెంకట్, సోమయ్య శాస్త్రి, శర్మ, నరసింహారావు, రోహిణి పాల్గొన్నారు.

జొన్నలను కనీస మద్దతు ధరకు కొనుగోలు చేస్తాం

● జాయింట్ కలెక్టర్ భార్గవ తేజ

గుంటూరు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు మార్క్‌ఫెడ్ సంస్థ జిల్లాలో 2024-25 సీజన్‌లో రైతులు పండించిన జొన్నలను కనీస మద్దతు ధరకు కొనుగోలు చేయడానికి నిర్ణయించినట్లు జాయింట్ కలెక్టర్ అమిలినేని భార్గవతేజ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జొన్నలు క్వింటాల్ రూ. 3,371కి కొనుగోలు చేసేందుకు జిల్లా స్థాయి జొన్న కొనుగోలు కమిటీ నిర్ణయం చేయడం జరిగిందన్నారు. ఈ పథకాన్ని సోమవారం నుంచి జొన్న కొనుగోలు కేంద్రాల వద్ద అమలులోకి తీసుకురావడం జరిగిందన్నారు. శాంపిల్స్ పరిశీలనచేసి ఈ క్రాప్‌లో నమోదైనవి కొనుగోలు చేస్తామన్నారు. రైతులు తమ పంట శాంపిల్స్‌ను కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చి నాణ్యత ప్రమాణాలను సరిచూసుకొని సీఎం యాప్‌లో రిజిస్ట్రేషన్ చేసుకొని జొన్నలను విక్రయించుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు రైతులు తమ సమీపంలోని రైతు సేవా కేంద్రాల వద్ద సంప్రదించాలని సూచించారు.


డబ్బులు ఇవ్వాలని బెదిరిస్తున్నారంటూ డీఆర్వోకు ఫిర్యాదు

గుంటూరు (తూర్పు), ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): గుంటూరుకు చెందిన మెట్ల ఉమాదేవి అనే మహిళ తనకు రూ.కోటి70 లక్షలు ఇవ్వాలని బెదిరింపులకు గురిచేస్తుందని పొన్నూరుకు చెందిన జి.పార్వతినందన్ ఆవేదన వ్యక్తం చేశాడు. ఇటీవల రోడ్డు ప్రమాదాన్ని గురై మంచానికే పరిమితమైన ఆయన అంబులెన్స్‌లో వచ్చి కలెక్టరేట్‌లో డీఆర్వో షేక్ ఖాజావలికి వినతిపత్రం అందజేశారు. అనంతరం జి పార్వతి నందన్ మాట్లాడుతూ ఇంటి దోషాలు, ఇతర పూజలు చేస్తూ ఉపాధి పొందుతున్నానని ఈ క్రమంలో మెట్ల ఉమాదేవి పరిచయం అయ్యిందని వివరించారు. ఈ మధ్యనే తాను నూతనంగా నిర్మించుకున్న ఇంటిపై ఆమె కన్నుపడిందని, దానిని ఎలాగైన స్వాధీనం చేసుకోవాలని ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. స్థానిక అధికారులను పంపి అనుమతులు లేవని చెప్పి బెదిరిస్తోందని వాపోయారు. దీనిపై కోర్టును ఆశ్రయించి ఇంజక్షన్ ఆర్డర్ తెచ్చుకున్నామని, ఇప్పుడు ఇంటిని వదిలేసి డబ్బులు ఇవ్వాలని బెదిరిస్తోందని వాపోయారు. ఆమెపై పొన్నూరు స్టేషన్లో ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోవడం లేదన్నారు.

గ్రంథాలయాల్లో వేసవి శిక్షణ ప్రారంభం

తెనాలి అర్బన్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): పట్టణం, రూరల్ మండల గ్రామాల్లోని గ్రంథాలయాల్లో సోమవారం వేసవి శిక్షణ తరగతులు ప్రారంభించారు. పట్టణంలోని నెహ్రూరోడ్డు, కొత్తపేట, నందివెలుగు, పెదరావూరు, సంగం జాగర్లమూడి గ్రంథాలయాల్లో బాలబాలికలకు వివిధ అంశాలపై శిక్షణ అందించారు. నందివెలుగులో పంచాయితీ కార్యదర్శి హేమకుమారి శిబిరాన్ని ప్రారంభించారు. విద్యార్థులు వేసవి శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. బొల్లు మాధవి పర్యవేక్షించారు. సంగం జాగర్లమూడిలో విశ్వనాథ్ శిక్షణను ప్రారంభించి మాట్లాడుతూ, విద్యార్థులు వేసవిలో ఆసక్తి ఉన్న అంశంలో శిక్షణ పొంది రాణించాలన్నారు. లైబ్రేరియన్ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బాల బాలికలకు వైద్య శిబిరం



వైద్య శిబిరంలో పాల్గొన్న డాక్టర్ నాగేశ్వరమ్మ

తెనాలి అర్బన్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పీజీఎం చిల్డ్రన్ హోమ్‌లో బాల బాలికలకు వైద్య శిబిరం నిర్వహించారు. చర్మ వ్యాధి నిపుణురాలు డాక్టర్ నాగేశ్వరమ్మ పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. హోమ్‌లో బాల బాలికలకు ఉచితంగా దుస్తులు అందజేశారు. తాగు నీటి కోసం వాటర్ ప్యూరిఫైర్ అందించారు. చిత్రలేఖనం పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. లైఫ్ లైన్ ఫౌండేషన్ సంస్థ సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహించారు.

పురపాలక సంఘానికి ఐదు అర్జీలు



అర్జీలను స్వీకరిస్తున్న మున్సిపల్ అసిస్టెంట్ సిటీప్లానర్ వాణి తదితరులు

తెనాలి, మారీసుపేట, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): పట్టణ పురపాలక సంఘం కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికను మున్సిపల్ అసిస్టెంట్ సిటీప్లానర్ వి.వాణి అధికారులతో కలసి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఇంజనీరింగ్ సెక్షన్‌కు మూడు అర్జీలు, మెప్మా విభాగానికి రెండు అర్జీలు వచ్చాయన్నారు. ఈ సమస్యలపై సంబంధిత శాఖల అధికారులతో చర్చించి పరిష్కరిస్తామని అసిస్టెంట్ సిటీ ప్లానర్ వాణి తెలిపారు. కార్యక్రమంలో పురపాలక సంఘ పలు శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రీవెన్స్‌కు 11 దరఖాస్తులు

తెనాలి అర్బన్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 11 దరఖాస్తులు అందించారు. రెవెన్యూ శాఖకు సంబంధించి 5, వైద్య ఆరోగ్యశాఖ సంబంధించి 2, పోలీసు, హౌసింగ్, పౌర సరఫరా, పంచాయతీరాజ్ శాఖకు సంబంధించి ఒక్కో దరఖాస్తు సబ్ కలెక్టర్‌కు అందించారు.

ఉపాధి హామీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

● ఎరుకలపూడి సర్పంచ్ సామ్రాజ్యం

తెనాలి రూరల్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): రైతు కూలీలందరూ వంద రోజులు పని కల్పించేలా ఏర్పాటుచేసిన ఉపాధి హామీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎరుకలపూడి గ్రామ సర్పంచ్ పసుపులేటి సామ్రాజ్యం చెప్పారు. సోమవారం మండలంలోని ఎరుకలపూడిలో జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ద్వారా చేపట్టిన పనులను సర్పంచ్ సామ్రాజ్యం ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ వేసవిలో రైతు కూలీలకు సొంత గ్రామాల్లోనే ఉపాధి కల్పించి వారిని ఆర్థికంగా ఆదుకోవాలని ప్రభుత్వం ఉపాధి హామి పథకాన్ని తీసుకు వచ్చిందన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ జనసేన ఆర్గనైజేషన్ సెక్రటరీ పసుపులేటి మురళీకృష్ణ, ప్రధాన కార్యదర్శి వెంకట శ్రీనివాసరావు, ఆలపాటి దుర్గారావు, ఉపాధి హామి ఫీల్డ్ అసిస్టెంట్, కూలీలు తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదాన పథకానికి రూ.1,11,116 విరాళం



దాతలకు జ్ఞాపికను అందజేస్తున్న ఈవో లీలా కుమార్

పెదకాకాని, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరంలోని కొరిటపాడుకు చెందిన పూనూరు బసివిరెడ్డి, శైలజ దంపతులు సోమవారం పెదకాకాని మల్లేశ్వర స్వామి దేవస్థానంకు విరాళం అందజేశారు. పూనూరు మాలకొండారెడ్డి జ్ఞాపకార్థం మల్లేశ్వరస్వామి దేవస్థాన నిత్యాన్నదాన పథకానికి రూ.1,11,116 విరాళం అందించినట్లు ఆలయ ఉప కమిషనర్, కార్యనిర్వహణాధికారి గోగినేని లీలా కుమార్ తెలిపారు. దాతలకు ప్రత్యేక దర్శనం, వేద ఆశీర్వచనం చేయించి శ్రీ స్వామివారి శేష వస్త్రంతో సత్కరించి చిత్రపటం అందజేశారు.

కార్మిక దినోత్సవాన్ని విజయవంతం చేయాలి: ఆరేటి

పొన్నూరు టౌన్, ఏప్రిల్, 28 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ కార్మిక దినోత్సవం మే డే వేడుకలను విజయవంతం చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి ఆరేటి రామారావు కోరారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో సోమవారం ఏఐటీయూసీ అనుబంధ సంఘాల సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన రామారావు మాట్లాడుతూ కార్మికుల హక్కుల కోసం పోరాడిన నాటి పరిణామాలను వివరించారు. 1986 మే1న హక్కుల కోసం పోరాడిన కార్మికులు మృతిచెందిన సంఘటనలను వివరించారు. మేడే సందర్భంగా పొన్నూరు పట్టణంలోని పలు కూడళ్లలో జరిగే కార్యక్రమాలను విజయవంతం చేయాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ అనుబంధ సంఘాల నాయకులు ఎం.సత్యనారాయణ, యలమంద, గుంటూరు ఏడుకొండలు, గుమ్మడి రోశయ్య తదితరులు పాల్గొన్నారు.

అదనపు పోలీసు బలగాల రాక

మంగళగిరి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): వచ్చే నెల రెండో తేదీన ప్రధాని నరేంద్ర మోదీ అమరావతి పర్యటన నేపథ్యంలో అదనపు పోలీసు బలగాలు మంగళగిరికి చేరుకున్నాయి. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి దాదాపు రెండు వేల మంది పోలీసు సిబ్బంది ఇక్కడకు వచ్చారు. స్థానిక పోలీసు యంత్రాంగం అదనపు బలగాలకు వసతుల కల్పనలో నిమగ్నమైంది. ప్రధాని మోదీ పర్యటన పూర్తయ్యే వరకు పోలీసు సిబ్బంది వివిధ ప్రాంతాల్లో బందోబస్తు విధులు నిర్వహించనున్నారు. ప్రధాని పర్యటన సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా కట్టుదిట్టమైన భద్రత చర్యలను చేపడుతున్నారు.

మతోన్మాద దాడులను అరికట్టాలి

తాడికొండ, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): మతోన్మాద దాడులను ప్రభుత్వాలు అరికాట్టాలని సీఐటీయూ జిల్లా నాయకులు యడ్లపల్లి గాంధీ రామ్మోహనరావు పేర్కొన్నారు. పెహల్గాంలో ఉగ్రదాడిని ఖండిస్తు సోమవారం తాడికొండ, బండారుపల్లి గ్రామాల్లో అంగన్‌వాడీ వర్కర్లు, సీఐటీయూ నాయకులు ఉగ్రదాడిలో చనిపోయిన వారికి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మతసామరస్యాన్ని కాపాడాలని, మతోన్మాద దాడులు జరగకుండా చర్యలు చేపట్టాలన్నారు. రైతు సంఘం నాయకులు చింతల భాస్కరరావు, పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.

వేసవి శిక్షణశిబిరం ప్రారంభం

పెదనందిపాడు, ఏప్రిల్, 28 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయంలో విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన వేసవి శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్ గేరా మోహనరావు అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరాన్ని సోమవారం ఆయన ప్రారంభించి, మాట్లాడారు. జూన్ 6వరకు ఉదయం 8 నుండి 11గంటల వరకు తరగతులు నిర్వహించడం జరుగుతుందన్నారు. గ్రంథాలయ అధికారిణి సుభాషిణి, విశ్రాంత ఉపాధ్యాయులు గారపాటి రమేష్, బోరుగడ్డ శ్యాంసన్, కొత్రపాటి సువార్తసుహాసిని, మంజుల పాల్గొన్నారు.

బాధితురాలికి ఎల్‌ఓసీ అందజేత



బాధితురాలికి ఎల్‌ఓసీ అందజేస్తున్న నేతలు

తాడేపల్లి టౌన్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ఎంటీఎంసీ తాడేపల్లి పట్టణం 14వ వార్డులోని అనారోగ్యంతో బాధపడుతున్న నేరిశెట్టి పద్మావతికి సీఎం సహాయ నిధి నుండి మంత్రి నారా లోకేశ్ రూ.60వేలు ఎల్‌ఓసీ మంజూరు చేయించారు. సోమవారం టీడీపీ నాయకులు పద్మావతి నివాసానికి వెళ్లి మంజూరు పత్రాన్ని అందజేశారు. టీడీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి దారా దాసు, బూదాల రవికుమార్, వల్లభాపురం పీటర్‌పాల్, బి మరియన్న, దేవుళ్ళ ప్రసాద్, మహిళా కార్యదర్శి కల్యాణి పాల్గొన్నారు.

మోదీ సభకు భారీగా తరలిరావాలి

తాడేపల్లి (పెనుమాక), ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి పునర్నిర్మాణ కార్యక్రమానికి విచ్చేస్తున్న ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు సభకు పెనుమాక గ్రామం నుండి భారీగా టీడీపీ శ్రేణులు తరలిరావాలని పార్టీ మండల ప్రధాన కార్యదర్శి కొల్లి శేషు పిలుపునిచ్చారు. ఆదివారం రాత్రి పెనుమాక గ్రామ టీడీపీ కార్యాలయం వద్ద పాలెపు వీరేంద్రనాథ్ అధ్యక్షతన జరిగిన అమరావతి రైతులు, రైతు కూలీలు, టీడీపీ నేతలు, కార్యకర్తలు సమావేశంలో శేషు మాటాడారు. పెనుమాక నుండి 1,500 మంది వరకు బస్సుల్లో శుక్రవారం మధ్యాహ్నం 2వ తేదీ 2 గంటలకు గ్రామ టీడీపీ ఆఫీసు నుండి కలిసికట్టుగా వెళ్లాలని నిర్ణయించినట్టు చెప్పారు. పఠాన్ జానీఖాన్, స్థానిక టీడీపీ నేతలు మహిళా నేతలు పాల్గొన్నారు.

బాలల సమ్మర్ క్యాంప్ ప్రారంభం

తాడేపల్లి టౌన్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి బైపాస్ రోడ్డులోని అమరావతి ఐకాన్‌లో సోమవారం నుండి మే 12 వరకు అమరావతి ఐకాన్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్, మంగళగిరి-తాడేపల్లి బాలోత్సవం ఆధ్వర్యంలో సమ్మర్ క్యాంప్ ప్రారంభించారు. బాలోత్సవం కోశాధికారి గాదె సుబ్బారెడ్డి మాట్లాడుతూ పిల్లలకు విజ్ఞానంతోపాటు వినోదం కూడా అవసరమన్నారు. గణితం, డ్యాన్స్‌లలో ఉపాధ్యాయులు ఇస్తున్న శిక్షణను చిన్నారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వై.సుబ్బారావు ముఖేష్, మనోహర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, లెనిన్‌బాబు గణేష్ పాల్గొన్నారు.

మే డేను జయప్రదం చేయాలి

తాడేపల్లి టౌన్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మేడేను జయప్రదం చేయాలని ది మంగళగిరి ఏరియా ఆటో డ్రైవర్స్ అండ్ ఓనర్స్ అసోసియేషన్ పిలుపునిచ్చింది. సోమవారం నులకపేటలోని కార్యాలయంలో అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ ఆరోజు జెండా ఆవిష్కరణలు ర్యాలీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఆటో యూనియన్ అధ్యక్షుడు ఎస్కే శ్రీను, గౌరవాధ్యక్షుడు బి.కొండారెడ్డి ఎస్కే సైదా, జాన్‌సైదా, జి శ్రీను, వినయ్, రామారావు, కృష్ణ పాల్గొన్నారు.

బాలయ్య సంస్మరణ సభను జయప్రదం చేయండి

తుళ్లూరు, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): అమరావతి ఉద్యమంలో అమరుడైన పెదపరిమి గ్రామానికి చెందిన అత్తిపట్ల బాలయ్య సంస్మరణ సభ బుధవారం పెదపరిమిలో జరుగుతుందని అమరావతి రాజధాని బాధిత రైతాంగ పోరాట వేదిక సోమవారం ఒక ప్రకటలో పేర్కొంది. అమరవీరులను స్మరించుకుంటూ మంగళవారం పెదపరిమి రైతు ధర్నా శిబిరం నుండి బౌద్ధ ధ్యాన మందిరం వరకు కొవ్వొత్తుల ర్యాలీ జరుగుతుందన్నారు. కార్యక్రమంలో శ్రీలంకకు చెందిన బౌద్ధ భిక్షువు బోధీమీన్ పాల్గొంటారని తెలిపింది. సాయి ఫంక్షన్ హాల్లో ఉదయం 9 గంటలకు సంస్మరణ సభ మొదలవుతుందని, రైతు జేఏసీ నేతలు, ప్రజా సంఘాల నేతలు పాల్గొంటారని వెల్లడించింది.

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం

దుగ్గిరాల, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో మజ్జిగ చలివేంద్రాలను సోమవారం ప్రారంభించారు. మంత్రి నారా లోకేష్ సహకారంతో స్థానిక శివాలయం సెంటర్లోని బస్‌షెల్టర్ వద్ద, దోస్త్ స్వచ్ఛంద సేవా సంస్థ సహకారంతో తెనాలి - విజయవాడ మెయిన్ రోడ్డులోని ఇన్‌డేన్ గ్యాస్ ఏజెన్సీ వద్ద ఈ చలివేంద్రాలను ఏర్పాటు చేశారు. దోస్త్ అధ్యక్షుడు మిక్కిలినేని గాంధీ, టీడీపీ వాణిజ్య విభాగ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గూడూరు వెంకట్రావు, గద్దె శ్రీనివాస్ శిబిరాలను ప్రారంభించారు. నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అమరావతి అన్‌స్టాపబుల్

● రాజధాని రైతులతో సీఎం చంద్రబాబు భేటీ
● ప్రధాని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి
● అమరావతి వేగవంతం కావడానికి మరో 44 వేల ఎకరాలు

తుళ్ళూరు, ఏప్రిల్ (ఆంధ్రజ్యోతి) రాజధాని రైతులతో సీఎం చంద్రబాబు నాయుడు ఉండవల్లి గృహంలో సోమవారం భేటీ అయ్యారు. రాజధాని అమరావతి పునః నిర్మాణ పనుల ప్రారంభానికి మే 2న ప్రధాని నరేంద్ర మోదీ శంకుస్థాపన చేయనున్న నేపథ్యంలో సభను విజయవంతం చేయాలని రైతులను కోరారు. అమరావతి పనులు జెట్ స్పీడ్‌తో జరుగుతాయని రైతులు ఆందోళన చెందాల్సిన పనిలేదని చంద్రబాబు స్పష్టం చేసినట్లు భేటీకి వెళ్లిన తుళ్లూరు మండల రైతులు, రైతు జేఏసీ నేతలు తెలిపారు. గ్రామ కంఠాలు, అసైన్డ్ రైతుల సమస్యలను చంద్రబాబు దృష్టికి రైతులు తీసుకెళ్లారు. అన్నీ పరిష్కారం అవుతాయని, నిశ్చింతగా ఉండాలని చంద్రబాబు హామీ ఇచ్చినట్లు రైతులు పేర్కొన్నారు. ప్రధాని సభకు రాజధాని అమరావతిలోని ప్రతి ఒక్కరూ హాజరై విజయవంతం చేయాల్సిన బాధ్యత ఉందని.. అదే ప్రధానికి మనం వచ్చే గౌరవం అని సీఎం చెప్పినట్లు తెలిపారు. 11 గ్రామాల్లో మరో 44 వేల ఎకరాలు రైల్వే స్టేషన్, అంతర్జాతీయ విమానాశ్రయం, అంతార్జాతీయ స్పోర్ట్స్ స్టేడియం, ఇన్నర్, అవుటర్ రింగ్‌రోడ్డుకు అతీసుకోవాల్సి ఉందని సీఎం వివరించినట్లు తెలిపారు. అంత మాత్రన అమరావతి అభివృద్ధికి డోకా లేదని సీఎం చెప్పారన్నారు. తమకు ఇంత వరకు అభివృద్ధి లేదని, అక్కడ తీసుకుంటే ఇక్కడ సమస్యలు ఇక్కడే ఉంటాయెమోనని రైతులు సీఎం దగ్గర అనుమానం వ్యక్తం చేశారు. ఇందులో సందేహం వద్దని అమరావతిలో రూ.లక్ష కోట్ల పనులకు ప్రధాని శంకుస్థాపన చేస్తారని చెప్పారన్నారు. ఇప్పటికే రూ.44 వేల కోట్లకు టెండర్లు పిలిచి పనులు మొదలు పెట్టడానికి కంపెనీలు సిద్ధంగా ఉన్నట్టు.. అమరావతి అన్‌స్టాబబుల్ అని చంద్రబాబు తమకు చెప్పారని రైతులు తెలిపారు. తుళ్లూరు మండలంలో ల్యాండు పూలింగ్‌కి భూమి ఇచ్చిన 18 గ్రామాలకు చెందిన రైతులు, రైతు నాయకులు తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ , పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ , మంత్రులు నారాయణ, అనగాని సత్య ప్రసాద్ వంగలపూడి అనిత ఈ భేటీలో పాల్గొన్నారు.

ప్రధాని మోదీ పర్యటనను విజయవంతం చేయాలి

● మంత్రి గొట్టిపాటి రవికుమార్

మంగళగిరి సిటీ, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): అమరావతి రాజధాని పనులను పునఃప్రారంభించేందుకు మే 2న రాష్ట్రానికి విచ్చేస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ పర్యటనను కూటమి నాయకులు విజయవంతం చేయాలని మంత్రి గొట్టిపాటి రవికుమార్ పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళగిరి టీడీపీ కార్యాలయం డాక్టర్ ఎమ్మెస్సెస్ భవన్‌లో టీడీపీ, జనసేన, బీజేపీ నేతలతో మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎమ్మెల్యే అరిమిల్లి రాధాకృష్ణ సమీక్ష సమావేశం నిర్వహించారు. జన సమీకరణ, వాహనాల ఏర్పాటు తదితర అంశాలపై చర్చించారు. మంత్రి గొట్టిపాటి మాట్లాడుతూ ప్రధాని మోదీ గత పర్యటనలకు మించి ఈ పర్యటనను విజయవంతం చేయాలని, అందుకోసం కూటమి నేతలందరూ బాధ్యతగా పనిచేయాలని సూచించారు. అమరావతిలో రూ.లక్ష కోట్ల విలువైన పనులకు ప్రధాని మోదీ శంకుస్థాపన చేస్తారని చెప్పారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో విధ్వంసానికి గురైన అమరావతి రాజధాని అభివృద్ధిని తిరిగి పట్టాలు ఎక్కించేందుకు ప్రధాని మోదీ చేతులమీదుగా మరోసారి కూటమి ప్రభుత్వం అమరావతి 2.0కు శ్రీకారం చుట్టిందన్నారు. అమరావతి రాజధాని ప్రపంచంలోనే తొలి సోలార్ నగరంగా చరిత్ర సృష్టించబోతుందని చెప్పారు. జగన్ రెడ్డి నిర్వాకం వలన రూ.2లక్షల కోట్ల విలువైన 130 పరిశ్రమలు, ప్రఖ్యాత వ్యాపార, విద్యాసంస్థలు పొరుగు రాష్ట్రాలకు తరలిపోవడంతో లక్షలాదిమంది ఉపాధి, ఉద్యోగాలను కోల్పోయారని ఆరోపించారు. ఎమ్మెల్యే అరిమిల్లి రాధాకృష్ణ మాట్లాడుతూ అమరావతి పునర్నిర్మాణ పనుల ప్రారంభోత్సవంలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని కోరారు. 175 నియోజకవర్గాలకు ఉద్యోగ కల్పవల్లిగా అమరావతి అభివృద్ధి చెందబోతుందన్నారు. ఈ సమావేశంలో టీటీడీ ధర్మకర్తల మండలి సభ్యురాలు తమ్మిశెట్టి జానకీదేవి, ఏపీ పద్మశాలి కార్పొరేషన్ ఛైర్మన్ నందం అబద్ధయ్య, ఏపీఎంఎస్ఐడీసీ ఛైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పంచుమర్తి ప్రసాద్, నియోజకవర్గ పరిశీలకుడు ముమ్మిడి సత్యనారాయణ, మంగళగిరి మార్కెట్ యార్డు ఛైర్మన్ జవ్వాది కిరణ్‌చంద్, దుగ్గిరాల మండల అధ్యక్షురాలు కేసంనేని శ్రీఅనిత, తాడేపల్లి పట్టణ అధ్యక్షుడు వల్లభనేని వెంకట్రావు, జనసేన ఎంటీఎంసీ అధ్యక్షుడు మునగపాటి వెంకట మారుతీరావు, నేతలు పాల్గొన్నారు.

శరవేగంగా మంచికలపూడి వంతెన నిర్మాణం



మంచికలపూడి సమీపంలో డీఆర్‌బీసీ వాగుపై నిర్మాణం జరుగుతున్న వంతెన

దుగ్గిరాల, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): మంచికలపూడి సమీపంలో డీఆర్‌బీసీ వాగుపై వంతెన నిర్మాణం పనులు శరవేగంగా జరుగుతున్నాయి. కొన్నేళ్లుగా రెయిలింగ్ కూడా లేక ప్రమాదకరంగా మారిన వంతెన పనులు మంత్రి నారా లోకేష్ ఆదేశాలతో ఇటీవల ప్రారంభమయ్యాయి. గ్రామీణ సడక్ యోజన కింద రూ.1.10 కోట్లతో నిర్మిస్తున్న రోడ్డు నిర్మాణం పనులు పూర్తైన వెంటనే దుగ్గిరాల పెనుమూలి మధ్య మంచికలపూడి రోడ్డు పనులు సైతం పూర్తి చేస్తామని పీఐయూ డీఈ అన్సారీ తెలిపారు. వంతెన నిర్మాణం కొనసాగుతున్నందునే రోడ్డు నిర్మాణం పనుల్లో కొంత జాప్యం నెలకొందని, వాహనదారులకు ఇబ్బంది లేకుండా ప్రత్యామ్నాయంగా వాగులో గ్రావెల్‌తో రోడ్డు నిర్మించామని తెలిపారు. కేఆర్ కొండూరు, పెనుమూలి గ్రామస్తులతోపాటు, మహంకాళీ అమ్మవారి ఆలయానికి వివిధ వాహనాలపై వెళ్లే భక్తులు సైతం ప్రత్యామ్నాయ మార్గం గుండా ప్రయాణం చేయవచ్చునని అధికారులు తెలిపారు.



మాట్లాడుతున్న సీపీఐ పట్టణ కార్యదర్శి ప్రభాకర్‌రావు

పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

మంగళగిరి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): పారిశుధ్య కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని సీపీఐ పట్టణ కార్యదర్శి అన్నవరపు ప్రభాకర్‌రావు డిమాండ్ చేశారు. మంగళగిరి ఏఐటీయూసీ కార్యాలయంలో సోమవారం జరిగిన మునిసిపల్ వర్కర్స్ యూనియన్ సమావేశంలో ఆయన ప్రసంగించారు. కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ విధానాల వల్ల కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారని చెప్పారు. కార్మిక హక్కులు, చట్టాలను కాపాడుకునేందుకు ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఏపీ మునిసిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గండికోట దుర్గారావు, మునిసిపల్ మాజీ వైస్‌చైర్మన్ నందం బ్రహ్మేశ్వరరావు, రాచకొండ శివ పాల్గొన్నారు.

కేసన అరెస్టును ఖండించిన బీసీ నేతలు



మాట్లాడుతున్న పారేపల్లి మహేష్

మంగళగిరి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): సమగ్ర కుల గణన జరపాలని డిమాండ్ చేస్తూ విజయవాడలో శాంతియుతంగా ర్యాలీ నిర్వహిస్తున్న బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావును, నేతలను పోలీసులు అరెస్టు చేయడాన్ని సంఘం జిల్లా నేతలు ఖండించారు. మంగళగిరిలోని సంఘం రాష్ట్ర కార్యాలయంలో సోమవారం విలేకరులతో జిల్లా అధ్యక్షుడు పారేపల్లి మహేష్ మాట్లాడారు. ర్యాలీ నిర్వహణకు సంబంధించి పది రోజుల ముందుగానే అనుమతి కోసం దరఖాస్తు చేసుకోగా, అనుమతి లేదని అడ్డుకోవడం దారుణమన్నారు. సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు శివరాం బాబాజీ, జిల్లా ఉపాధ్యక్షుడు జంజనం వరప్రసాద్, తుమ్మా కామేశ్వరీ, అడపా శ్రీనివాసరావు, దానా గౌడ్ పాల్గొన్నారు.

నేడు తిరుపతమ్మ, గోపయ్య కల్యాణ మహోత్సవం

వట్టిచెరుకూరు, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): ముట్లూరులో లక్ష్మీతిరుపతమ్మ, గోపయ్య స్వామి వార్ల కల్యాణ మహోత్సవాన్ని మంగళవారం నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. తిరునాళ్లలో భాగంగా సోమవారం సాయంత్రం గ్రామంలో బలిహరణ కార్యక్రమం ఉత్సవ విగ్రహాల ఊరేగింపు వైభవంగా జరిగింది. ఆలయాన్ని విద్యుద్దీపాలతో సుందరంగా అలంకరించారు.



మంగళగిరి పట్టణానికి చెందిన ప్రముఖులు వడ్లమూడి వెంకయ్య చౌదరి వైకుంఠ సమారాధన సోమవారం జరిగింది. ఏపీఎంఎస్ఐడీసీ ఛైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు, వివిధ పార్టీల నాయకులు, ఇతర ప్రముఖులు హాజరై వెంకయ్య చౌదరి చిత్రపటానికి నివాళులర్పించారు. -మంగళగిరి

కర్రసాములో పెదనందిపాడు విద్యార్థుల ప్రతిభ



విద్యార్థికి బంగారు పతకం, ప్రశంసాపత్రం అందజేస్తున్న జిల్లా క్రీడాధికారి నరసింహారెడ్డి

పెదనందిపాడు, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): బాపట్ల జిల్లా పర్చూరు ఏసీఎంఈ పాఠశాలలో సిలంబమ్ నోబెల్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ ఆధ్వర్యంలో జాతీయస్థాయి కర్రసాము పోటీలు నిర్వహించారు. పెదనందిపాడుకు చెందిన మామిడిపాక మోక్షిత్ రామకృష్ణ, దాసరి మణికంఠ సింగిల్ కర్రతో స్పీడ్ రోటేట్‌తో వేగంగా ఎక్కువ సమయం(15ని.) తిప్పి ప్రతిభ కనబర్చడంతో వారికి బంగారు పతకాలు, ప్రశంసా పత్రాలను జిల్లా క్రీడాధికారి నరసింహారెడ్డి ప్రదానం చేశారు. శిక్షణనిచ్చిన కోచ్ చావా రామును ప్రత్యేకంగా అభినందించారు.

ముగిసిన అద్దంకమ్మ తల్లి తిరునాళ్ల

వట్టిచెరుకూరు, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఐదు రోజుల నుంచి వైభవంగా అద్దంకమ్మ తిరునాళ్ల మహోత్సవం జరుగుతోంది. సోమవారం గ్రామంలోని మహిళలు భారీ ఎత్తున తరలివచ్చి పొంగళి నైవేద్యంతో సమర్పించడంతో తిరునాళ్ల ముగిసింది.

నేడు అనంతవరప్పాడులో శిడిమానోత్సవం

వట్టిచెరుకూరు, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): అనంతవరప్పాడు గ్రామంలో వేంచేసియున్న పోలేరమ్మ, అద్దంకమ్మ కొలువులలో ప్రధాన ఘట్టమైన శిడిమాను మహోత్సవం మంగళవారం జరగనుంది. సోమవారం గ్రామంలో ఘటం కుండ ప్రదర్శన, పావన ఊరేగింపు వైభవంగా నిర్వహించారు.

ఆకట్టుకున్న స్టార్టప్ ఎక్స్‌పో

● అందరి దృష్టిని ఆకర్షించిన విద్యార్థుల ఆవిష్కరణలు
● హైలెట్‌గా విట్ విద్యార్థుల 'విసు' హ్యూమనాయిడ్ ఏఐ రోబో
● మహిళా రక్షణ కోసం సర్వైలెన్స్ డ్రోన్ ఏర్పాటు

గుంటూరు, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): విట్ యూనివర్సిటీ వీ లాంచ్‌ప్యాడ్ 2025 స్టార్టప్ ఎక్స్‌పో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. విద్యార్థులు, నూతన ఎంటర్‌ప్రెన్యూర్లు రూపొందించిన ఆవిష్కరణలు ముఖ్యమంత్రిని ప్రత్యేకంగా ఆకర్షించాయి. దీంతో ఆయన వాటి వివరాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. మొత్తం ఎక్స్‌పోలో విట్ విద్యార్థులు రూపొందించిన హ్యూమనాయిడ్ రోబో మానవ స్పందనలతో ఆకట్టుకుంది.

● విసు ఏఐ రోబో అద్భుత ప్రదర్శన

స్టార్టప్ ఎక్స్‌పోలో విట్ విద్యార్థులు ప్రదర్శించిన హ్యూమనాయిడ్ రోబో విట్ సూపర్ ఇంటెలిజెంట్ యుటిలిటీ(విసు)రోబో హావభావ ప్రకటనలతో అందరినీ ఆకట్టుకుంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రోగ్రాంతో రూపొందించిన ఈ రోబో మనం ఇచ్చే కమాండ్లకు అనుగుణంగా పనిచేయడమే కాకుండా, మనం కోప్పడితే.. దాన్ని అర్థం చేసుకుని సారీ కూడా చెప్పడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. ఈ రోబోను నందన్, రికిల్, అతుల్, విధిలేశ్, ప్రవీణ్ అనే సీఎస్ఈ, ఈసీఈ విద్యార్థులు రూపొందించారు.

● సర్వైలెన్స్ డ్రోన్ శక్తితో మహిళలకు రక్షణ

జీవోఏజీ సర్వీసెస్ సంస్థ రూపొందించిన సర్వైలెన్స్ డ్రోన్ శక్తి మరో ఆకర్షణగా నిలిచింది. ఇది మూడు కి.మీ పరిధిలోని అత్యవసర కాల్ 112 సాస్ కాల్‌ను గుర్తించి వెంటనే పోలీసులకు సమాచారం అందిస్తుంది. జీపీఎస్ ఆధారంగా ఈ కాల్ వచ్చిన వివరాలను పోలీసులకు అందజేయడంతోపాటు, వెంటనే ఆ ప్రాంతానికి వెళ్లిపోతుంది. అక్కడి పరిస్థితులను పోలీసులకు చేరవేస్తుంది. దీంతోపాటు వ్యవసాయ అవసరాల కోసం కూడా ఈ సంస్థ అగ్రోస్-ఎక్స్-10ఎల్ అనే 10 లీటర్ల పేలోడ్‌తో మరో భారీ రీచార్జబుల్ డ్రోన్‌ను రూపొందించింది. ఇవి రెండూ అప్రూవల్‌దశలో ఉన్నాయి.

● బ్యాటరీ విజిలెన్స్ డాగ్..

క్యాగ్ స్మార్ట్ ఈవీ సొల్యూషన్ సంస్థ నేతృత్వంలో బ్యాటరీ విజిలెన్స్ డాగ్ ప్రత్యేక ఆకర్షణగా ఉంది. ఈ డాగ్ ఈవీ బ్యాటరీల చుట్టూతిరిగి బ్యాటరీ శక్తి సామర్థ్యాలను, లోపాలను అంచనావేసి సైట్‌లో అప్‌డేట్ చేస్తుంది. దాని ఆధారంగా బ్యాటరీ ఆప్టిమైజేషన్ చేసేందుకు వీలుంటుందని మాజీ విద్యార్థి చెబుతున్నారు.

● పవర్ సేవింగ్ స్మార్ట్ విషన్ ఈ మ్యాక్

ఎక్స్‌పోలో ప్రణీత విద్యుత్ ఆదా చేసే మీటర్లను ప్రదర్శించారు. పారిశ్రామిక అవసరాల కోసం ఈమ్యాక్, వ్యవసాయ అవసరాల కోసం కిసాన్ మేట్, గృహావసరాల కోసం హౌసీ అనే స్మార్ట్ మిషన్‌ను ప్రదర్శించారు. వీటి ద్వారా 15 నుంచి 20 శాతం విద్యుత్ ఆదా చేయవచ్చని ఆమె చెబుతున్నారు.

● విట్ విద్యార్థుల సృష్టి ఈవీ 'ప్రయాణ'

విట్ విద్యార్థులు స్థానిక అవసరాల కోసం ప్రయాణ పేరుతో ఈవీ స్కూటర్ రూపొందించారు. ఫ్యాకల్టీ సుధా ఎల్లిసన్ మోట్లే ఆధ్వర్యంలో సైలేశ్, వైష్ణవి, కవిన్, భరత్, ఇసాన్ తదితర విద్యార్థులు దీన్ని రూపొందించారు. 25కి.మీ వేగంతో, 35 కి.మీ రేంజితో నడిచే ఈ వాహనాన్ని యూనివర్సిటీ లోపల అవసరాల కోసం వినియోగిస్తామని విద్యార్థులు చెబుతున్నారు.



హ్యూమనాయిడ్ రోబో విసుతో విద్యార్థి నందన్



ప్రయాణతో విట్ విద్యార్థులు



పవర్ సేవింగ్ మిషన్లతో జే ప్రణీత



సర్వైలెన్స్ డ్రోన్‌తో మార్కెటింగ్ హెడ్ గణేశ్



బ్యాటరీ విజిలెన్స్ డాగ్‌తో ఎస్ఆర్ఎం విద్యార్థి

ప్రణాళికాబద్ధంగా అమరావతి పునర్నిర్మాణం

● బేతపూడి రచ్చబండలో మంత్రి నాదెండ్ల మనోహర్

మంగళగిరి సిటీ, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): అమరావతి రాజధాని పునర్నిర్మాణ పనులు ప్రణాళికాబద్ధంగా చేపడుతున్నామని జనసేన పార్టీ పీఏసీ ఛైర్మన్, మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. మంగళగిరి మండలం బేతపూడి గ్రామంలోని రామాలయం సెంటరులో రావి చెట్టు వద్ద సోమవారం జనసేన పార్టీ ఆధ్వర్యంలో రచ్చబండ కార్యక్రమం జరిగింది. రచ్చబండకు మంత్రి మనోహర్ అధ్యక్షత వహించి ప్రసంగించారు. జనసేన ఇప్పుడు ప్రశ్నించే పార్టీగా మాత్రమే కాకుండా ప్రజా సమస్యలను పరిష్కరించే స్థాయికి ఎదిగిందన్నారు. అమరావతిని రాజధానిగా అభివృద్ధి చేసేందుకు రైతులు చేసిన త్యాగాలే కూటమి ప్రభుత్వ ఏర్పాటుకు నాంది పలికాయని గుర్తుచేశారు. గత ప్రభుత్వం అమరావతిని నిర్లక్ష్యం చేసి, మూడు రాజధానుల పేరిట రైతులను మోసం చేసిందని, దీంతో రాష్ట్రం అన్ని రంగాల్లోనూ వెనుకబాటుకు గురైందని చెప్పారు. సీఆర్డీఏ పరిధిలోని 29 గ్రామాల్లో రోడ్లు, భవనాలు వంటి మౌలిక వసతుల అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. మే రెండో తేదీన అమరావతిలో జరుగబోయే ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పర్యటనను పండుగ వాతావరణంలో విజయవంతం చేయాలని మంత్రి నాదెండ్ల మనోహర్ పిలుపునిచ్చారు. ఈ రచ్చబండలో ఏపీఎంఎస్ఐడీసీ ఛైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు, ఎర్రబాలెం, బేతపూడి, ఐనవోలు గ్రామాల ప్రజలు, కూటమి నాయకులు, జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.

మా నాన్న పసివాడే.. షార్ట్‌ఫిల్మ్‌కు జ్యూరీ బహుమతి



బహుమతి అందుకుంటున్న షార్ట్ ఫిల్మ్ సిబ్బంది

తాడేపల్లి (ఉండవల్లి), ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ కేకేఆర్ వ్యాలీ నిర్వహించిన షార్ట్ ఫిల్మ్ ఫెస్టివల్ 2025లో "మా నాన్న పసివాడే" లఘు చిత్రానికి షార్ట్‌ఫిల్మ్ జ్యూరీ బహుమతి లభించింది. ఉండవల్లి గ్రామానికి చెందిన గాదె నాగభూషణం రచనా దర్శకత్వంలో త్రినేత్ర ప్రొడక్షన్స్ ఆధ్వర్యంలో ఈ లఘు చిత్రాన్ని రూపొందించారు. ఈ షార్ట్ ఫిల్మ్ పోటీల్లో రెండు తెలుగు రాష్ట్రాల నుండి 96 లఘు చిత్రాలు ఎంట్రీకి రాగా, జ్యూరి వాటిలోని టాప్ 10 ఉత్తమ చిత్రాలను ఎంపిక చేసింది. వీటిని ఆగిరిపల్లిలోని కేకేఆర్ వ్యాలీ స్కూల్ థియేటర్‌లో ప్రదర్శించిన అనంతరం విజేతలకు షార్ట్ ఫిల్మ్ నిర్వాహకులు కొసరాజు కోటేశ్వరరావు చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. గాదె నాగభూషణం తన టీమ్‌తో బహుమతి అందుకున్నారు. వృద్ధులను కుటుంబ సభ్యులు ప్రేమతో ఆదరించాలని, ఎదిగిన పసివాళ్లుగా చూడాలన్న సందేశంతో ఈ షార్ట్ ఫిల్మ్ రూపొందించారు. ఈశ్వరయ్య పాత్రలో జొన్నా రామలింగేశ్వరరావు నటనకు జేజేలు పలికారు.



ప్రధాని మోదీకి బహిరంగ లేఖ విడుదల చేస్తున్న సీపీఎం రాజధాని నేతలు

రాజధాని అభివృద్ధికి కేంద్రం నిధులు ప్రకటించాలి

● సీపీఎం రాజధాని నేతల డిమాండ్

తాడేపల్లి (ఉండవల్లి), ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): అమరావతి రాజధాని పనుల పునఃప్రారంభానికి మే 2న విచ్చేస్తున్న ప్రధాని మోదీ రాజధాని అభివృద్ధికి కేంద్రం నుండి నిధులు ఇస్తున్నట్టుగా ప్రకటించాలని సీపీఎం రాజధాని కమిటి నేతలు డిమాండ్ చేశారు. అమరావతి నిర్మాణానికి రూ.లక్ష కోట్లు అవసరమవుతాయని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిందని ఈ మేరకు మోడీ అప్పులు కాకుండా గ్రాంట్‌లు ఇస్తున్నట్టుగా స్పష్టంగా ప్రకటించాలని సోమవారం సాయంత్రం ఉండవల్లి సీపీఎం కార్యాలయం వద్ద రాజధాని సీపీఎం నేతలు బహిరంగ లేఖ విడుదల చేశారు. కార్యక్రమంలో సీపీఎం రాజధాని డివిజన్ కార్యదర్శి ఎంరవి, భాగ్యరాజు తదితరులు పాల్గొన్నారు. తాడేపల్లి సీపీఎం కార్యాలయంలో ప్రధాన మంత్రికి సీపీఎం రాష్ట్ర కమిటి ప్రతిపాదించిన లేఖను స్థానిక నేతలు ఆవిష్కరించారు. జొన్నా శివశంకర్, బూరుగ వెంకటేశ్వర్లు, దొంతిరెడ్డి వెంకటరెడ్డి, వి.దుర్గారావు పాల్గొన్నారు.



క్రీడాకారులతో వీవీఐటీయూ ఛైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్

సమాజంలో క్రీడలకు అధిక ప్రాధాన్యం

● కొండూరు వెంకటాద్రి

పెదకాకాని, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): నేటి సమాజంలో క్రీడలకు అధిక ప్రాధాన్యం ఉందని, ప్రభుత్వం క్రీడాకారులకు అనేక ప్రోత్సాహకాలు అందిస్తోందని ఇండియన్ ఆర్చరీ క్రీడాకారుడు కొండూరు వెంకటాద్రి అన్నారు. సోమవారం వాసిరెడ్డి వెంకటాద్రి ఇంటర్నేషనల్ టెక్నోలాజికల్ యూనివర్సిటీ నిర్వహించిన క్రీడా దినోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అంతర్ కళాశాల క్రీడా పోటీల విజేతలకు వీవీఐటీయూ చాన్సలర్ వాసిరెడ్డి విద్యాసాగర్‌తో కలసి పురస్కారాలు, ప్రశంస పత్రాలు ప్రదానం చేశారు. వర్సిటీ నుండి వివిధ జాతీయ అంతర్జాతీయ జట్లకు ఎంపికైన విద్యార్థులను ఆయన అభినందించారు. ప్రిన్సిపాల్ వై.మల్లికార్జున రెడ్డి, అకడమిక్ డీన్ కె.గిరిబాబు, డీన్ కె.సత్యనారాయణ, ఫిజికల్ డైరెకర్ ఎన్.అరుణ్ కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రారంభమైన మట్టి నమూనాల సేకరణ



మట్టి నమూనాలు సేకరిస్తున్న దృశ్యం

ప్రత్తిపాడు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలో మట్టి నామూనాల సేకరణ ప్రారంభించారు. రానున్న వ్యవసాయ సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని మండలంలో 830 నమూనాలను సేకరించేందుకు వ్యవసాయ శాఖ అధికారులు సిద్ధమయ్యారు. వచ్చే నెల 15వ తేదీ వరకు మట్టినమూనాల సేకరించి పరీక్ష కేంద్రాలకు పంపుతామని మండల వ్యవసాయ శాఖాధికారి అరుణకుమారి తెలిపారు. మొత్తం 14 రకాల పరీక్షలు నిర్వహించనున్నారు.

వేసవి విజ్ఞాన తరగతులు ప్రారంభం

ప్రత్తిపాడు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు శాఖా గ్రంథాయలయంలో వేసవి విజ్ఞాన తరగతులు ప్రారంభమయ్యాయి. ఉదయం 8 నుండి 11 గంటల వరకు ప్రతి రోజు ఈ తరగతులు నిర్వహించడం జరుగుతుందని లైబ్రరియన్ అరుణ తెలిపారు.